నమ్మలేని నిజాలు

ఖైదీ కి రక్ష
సత్ప్రవర్తన భిక్ష
రద్దిక శిక్ష.

అప్పుల గోల
మంచి చెడుల క్రీడ
నిప్పుతో ముప్పు.

ఇస్తుతుపాను
జనజీవనం ధ్వంసం
నేచర్ ప్రకోపం.

చేప ప్రసాదం
ఉబ్బసానికి వరం
మిరగం రోజు.

డ్రామాల నేత
పంగనామాల పీఠ
పెట్టాలి కోత.

- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

శ్రీనిజాలు

కృష్ణ గోదావరి నదులు
ఎటు చూసిన మట్టి దిబ్బ !
కృష్ణ రామ హరీ హరీ
సాగులేక చావుదెబ్బ !
వెన్నెముకల మట్టి పూల
అన్నదాత మృత్యు ఘోష !
కలమెత్తిన గళమెత్తిన
బూడిదయ్యె కంఠశోష !

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 23-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:273 పేజీలు:6 వెల: రూ.1/-


# కొడంగల్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్ర.. వాటిని తిప్పికొట్టండి: సీఎం రేవంత్



వికారాబాద్, జులై 22: కొడంగల్ ప్రజలు, కార్యకర్తల ఆశీర్వాదంతోనే కాంగ్రెస్‌కు రాష్ట్రానికి నాయకత్వం వహించే అవకాశం వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు(బుధవారం) కొడంగల్‌లో పర్యటించిన సీఎం.. స్థానిక నాయకులు, బీఎల్‌ఏలతో సర్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'కొడంగల్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో దెబ్బతీయాలంటే పునాదులు దెబ్బతీయాలని చూస్తున్నారు. పేర్లు వేరైనా బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే. కొడంగల్‌లో కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగించాలని చూస్తున్నారు. ఇంట్లో పొగ పెడితే రేవంత్ రెడ్డి బయటకు రాకుండా ఉంటారని కుట్రలు చేస్తున్నారు. ఎదురు నిలబడలేక దొంగదెబ్బ తీయాలని కుట్ర చేస్తున్నారు. కొడంగల్‌లో కుట్రలు చేసేవారిని బొంద పెట్టే బాధ్యత మీపై ఉంది' అని అన్నారు.

119 నియోజకవర్గాలను అభివృద్ధి చేయడం కోసం రోజుకు 18 గంటలు పనిచేసినా సమయం సరిపోవడంలేదని సీఎం తెలిపారు. ఆగస్టు 3 వరకు గావఖీ గడువు ఉందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,51,255 ఓట్లున్నాయని.. కానీ 1,96,626 ఓట్లు మాత్రమే గావఖీలో నమోదు చేసుకున్నారని.. మిగిలిన 54,635 నమోదు చేసుకోలేదని సీఎం తెలిపారు. మొత్తం ఓట్లలో ఇంకా 22 శాతం నమోదు జరగలేదని చెప్పారు. ఆ ఓట్లను తొలగిస్తే ప్రమాదం పొంచి ఉందన్నారు. వారందరినీ తిరిగి నమోదు చేయించాల్సిన బాధ్యత బీఎల్‌ఏలపై ఉందన్నారు.

ఓటు పోగొట్టుకుంటే గుర్తింపు ఉండదని సీఎం తెలిపారు. ఓటు లేకుంటే చనిపోయిన వారితో సమానమన్నారు. కార్యకర్తగా ఇంటింటికీ వెళ్లి ఓటరు వెరిఫికేషన్ ఫారం నమోదు చేయించాలని నేతలకు సూచించారు.

ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లు తొలగించాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై కాంగ్రెస్‌ను దొంగదెబ్బ తీయాలని గూడుపుఠాణి చేస్తున్నాయని మండిపడ్డారు. ఓటర్ల వివరాలు ఎన్నికల అధికారులకు అందించాల్సిన బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లపైనే ఉందన్నారు. ఈనెల 30లోగా నూటికి నూరు శాతం కొడంగల్ నియోజకవర్గంలో ప్రక్షాళన పూర్తి కావాలని తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ఓటు కోల్పోవడానికి వీల్లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# నీట్ ప్రశ్నపత్రం లీక్‌పై పార్లమెంట్‌లో చర్చకు సిద్ధం: కేంద్రం



న్యూఢిల్లీ, జులై 22:నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీస్తున్న నేపథ్యంలో, ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్రం వెల్లడించింది. ప్రతిపక్షం చర్చ కోరితే ప్రభుత్వం వెనక్కి తగ్గలేదని, ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఈ ఘటనను 'ఘోర పాపం'గా అభివర్ణించారని పేర్కొంది.

నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు అంగీకరించినప్పటికీ, ప్రతిపక్షం ఆందోళన మార్గాన్ని ఎంచుకుందని కేంద్ర వర్గాలు ఆరోపించాయి. సీజేపీ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల ఆందోళనలకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. నీట్ లీక్ ఘటనపై పూర్తి స్థాయి చర్చ నిర్వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది.

కాగా, ఎన్‌డీఏ ఎంపీల సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ నీట్ ప్రశ్నపత్రం లీక్‌ను 'ఘోర పాపం'గా పేర్కొన్నారని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షను తిరిగి నిర్వహించామని ప్రధాని వివరించినట్లు చెప్పారు.

# కొడంగల్‌లో సీఎం ఓటు నమోదు
## –స్వగృహంలో సర్‌లో పాల్గొన్న సీఎం



వికారాబాద్, జులై 22: తెలంగాణలో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని తన స్వగృహంలో సర్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఎన్యూమరేషన్ పత్రాన్ని స్వయంగా నింపి సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్వో)కు అందజేశారు. ఈ సందర్భంగా తన ఓటు హక్కును నమోదు చేసుకున్నారు.ఓటరు జాబితాల ప్రక్షాళనలో ప్రతి అర్హుడూ భాగ స్వామి కావాలని, నిర్దేశిత గడువులోపు అవసరమైన వివరాలు సమర్పించి తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సీఎం సూచించినట్లు అధికారులు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో బాధ్యతా యుతంగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చినట్లు వెల్లడించారు.

# లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదు.. దేశాన్ని దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోం: సీఎం రేవంత్

వికారాబాద్, జులై 22: అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ, పోలీసుల పాశవిక దాడికి ఖండిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు(బుధవారం) కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను ఆ పార్టీ నాయకులు అమ్ముకుని.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అరెస్టు చేసి, పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవిక దాడి జరిపారని ఫైర్ అయ్యారు.

ఆడపిల్లలపై దాడి చేశారని.. విద్యార్థుల తలలు పగలగొట్టారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించడంలేదని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా? లేక కిడ్నాప్ చేశారో తెలియదన్నారు. విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ.. ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కు అని చెప్పుకొచ్చారు. పేపర్ లీక్‌పై పార్లమెంటులో చర్చ జరగకుండా అడ్డుకున్నారని.. రాహుల్ గాంధీపై పాశవిక దాడితో ఆయన రక్తం నేలకు చిందిందన్నారు. దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నా సోనియా గాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని.. మంత్రి పదవి కూడా చేపట్టలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా ఖర్గేను నియమించారు తప్ప పదవులు తీసుకోలేదని చెప్పుకొచ్చారు.

2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడి విద్యార్థుల ప్రాణాలు బలిగొందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లిందని.. అప్పుడే ఆ సంస్థపై క్రిమినల్ కేసులు పెట్టి ఉంటే ఇప్పుడు ఇలా జరిగి ఉండేది కాదన్నారు. నీట్ పరీక్ష నిర్వహించడంతో దొంగతనం చేయొచ్చన్న ధైర్యం వాళ్లకు వచ్చిందని విమర్శించారు. అభాఇలో జరిగిన అక్రమాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై విద్యార్థులు నిరసన తెలిపారన్నారు. లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదని.. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. యువత పక్షాన నిలిచి మోదీపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అందరం కలిసి పోరాటం చేసి మోదీని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# కరీంనగర్‌లో భారీ దోపిడీ..
## 66 తులాల బంగారం, 21లక్షల క్యాష్ చోరీ.. ఇంటి అల్లుడిపైనే అనుమానాలు!

కరీంనగర్, జులై 22: కరీంనగర్ పట్టణంలో మరోసారి దోపిడీ కలకలం రేపింది. పీఎంజే జ్యువెల్లరీ షాపులో దోపిడీ ఘటన జరిగిన రెండు నెలలు గడవకముందే, అదే తరహాలో మరో ఇంట్లో దోపిడీ జరిగింది. భగత్ నగర్‌కు చెందిన అజ్మత్ అలీ అనే వృద్ధుడి ఇంట్లోకి అర్ధరాత్రి 12 గంటల తర్వాత చొరబడిన దుండగులు.. 66 తులాల బంగారం, రూ.21 లక్షల నగదు, 10 తులాల వెండి ఎత్తుకెళ్లారు.

అజ్మత్ అలీ కుటుంబం భగత్ సింగ్ చౌరస్తాలోని ఓ ఇంట్లో మొదటి అంతస్తులో నివాసం ఉంటుంది. రాత్రి పడుకునే ముందు అజ్మత్ అలీ గ్రౌండ్ ఫ్లోర్‌లోని లైట్ ఆఫ్ చేసి లోపలికి వెళ్తుండగా.. బయట మాటువేసిన ఎనిమిది మంది దుండగులు ఒక్కసారిగా అతనిపై దాడి చేశారు. అరవకుండా నోరు మూసేసి, బలవంతంగా ఇంట్లోకి వెళ్లారు. అనంతరం తల, ముఖంపై గట్టిగా కొట్టారు. ఇంట్లో ఉన్న అతని భార్య, ఇద్దరు కుమార్తెలను సైతం తీవ్రంగా కొట్టారు. అరిస్తే చంపేస్తామని తుపాకులు, కత్తులతో బెదిరించారు.

బాధితులను తీవ్రంగా కొట్టి, అనంతరం వారిని కట్టేసి ఇంట్లో నుంచి 66 తులాల బంగారం, రూ.21లక్షల నగదు, 10 తులాల వెండి ఎత్తుకెళ్లారు. దోపిడీ అనంతరం వారు ఎవరికీ ఫోన్ చేయకుండా ఉండేదుకు వారి మొబైల్స్‌ను కూడా వెంట తీసుకెళ్లారు. వెళ్లే ముందు వారందర్నీ ఒక గదిలో బంధించి, పార్కింగ్‌లో ఉన్న రెండు బైక్‌లను చోరీ చేసి వాటిపై వెళ్లారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు. కాగా, వేములవాడ బైపాస్ మీద నుంచి నిందితులు పరారైనట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

కాగా, తెలిసిన వ్యక్తులే దోపిడీకి పాల్పడి ఉంటారని అజ్మత్ అలీ ఆరోపిస్తున్నాడు. పెద్ద అల్లుడిపైనే అనుమానం వ్యక్తం చేశాడు. ఇంటికి వచ్చిన 8 మంది దుండగులు ఉత్తరాది హిందీ మాట్లాడారని తెలిపాడు.

### రాధశ్రీ రాగాలు

వరగుణుల కాపాడు
రామ నారాయణుడు
భద్రగిరి లోనుండు
నను రాధశ్రీ !!
శ్రేయమ్ము నిడుచుండు
శిష్టగుణ సేవితుడు
చిలుకూరు నిలయండు
అనును రాధశ్రీ !!

–రాధశ్రీ
సెల్:9494481210

# అదుపుతప్పి మూడు వాహనాలను ఢీకొన్న వాటర్ ట్యాంకర్.. ఒకరి మృతి

రంగారెడ్డి, జులై 22: జిల్లాలోని నార్సింగి–పుప్పాలగూడ టోల్‌గేట్ వద్ద వాటర్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. అతివేగంగా దూసుకొచ్చిన ట్యాంకర్.. బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న సుశీల్ కుమార్(28) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

మరో వ్యక్తి సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం తర్వాత అదుపు తప్పిన ట్యాంకర్ మరో కారు, స్కూటీని కూడా ఢీ కొట్టింది. దీంతో మొత్తం మూడు వాహనాలను వాటర్ ట్యాంకర్ ఢీకొట్టింది. సమాచారం అందిన వెంటనే నార్సింగి పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

ట్యాంకర్ డ్రైవర్ రంజిత్ సింహాను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. అలాగే గాయపడిన సురేష్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

సుశీల్ మృతి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# రాహుల్, ఖర్గే, ప్రియాంక అరెస్టులను ఖండిస్తూ ఆందోళన
## –ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్




హుస్నాబాద్, జులై 22: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీతో పాటు ఇతర కాంగ్రెస్ నేతల అరెస్టులను నిరసిస్తూ బుధవారం సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ధర్నాలో మంత్రి పొన్న ప్రభాకర్, కాంగ్రెస్ నేతలు పాల్గొని ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ నిర్వహించిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ నిర్వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థుల భవిష్యత్తు, న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని నేతలు స్పష్టం చేశారు. ఈ మహాధర్నాలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### సప్త పదులు
ప్రక్రియా సృజనకర్త: సుధామ
సెల్:9849297958

ప్రాజ్ఞుడు
విజ్ఞుడు

కష్టసుఖాలను
సమానంగా స్వీకరించే
మానవుడే
స్థితప్రజ్ఞుడు!
–చంద్రకళ.దీకొండ
హైదరాబాద్

అమ్మ
బొమ్మ

కన్నవారి
కళ్ళ వెంట
రానీయదు
నీటిచెమ్మ
–బి.ఎ.ఎస్. ప్రసాద్
నల్లజర్ల

ఆకాశవాణి
మధురవాణి

సమయంతో పాటు
ఎన్నో
మింగేసింది
చరవాణి
–కె. వి. సత్య ప్రసాద్
మండపేట

కదలరు
మెదలరు

అవినీతికి
అలవాటైన
అధికారనీ,
పదవిని వదలరు..
–పద్మావతి పి.
హైదరాబాద్

పంపటం
లంపటం

మన
అనుకున్న బంధాలను
మనఃస్పర్ధలతో
చంపటం
–ద్విభాష్యం నాగలక్ష్మి
అనకాపల్లి

పాటలు
మాటలు

కావాలి
మదిలో
ఊరే అమృతపు
ఊటలు..
–పంతుల లలిత
విశాఖపట్నం..

గెలుపు
మలుపు

మాటలతో
కానప్పుడు
చేతలు
వీరత్వం తెలుపు
–విత్తనాల విజయకుమార్
హైదరాబాద్

చల్లదనం
కమ్మదనం

అమ్మ చేతి
గురుముద్దలో
ఉంది
తియ్యదనం
–కాయల నాగేంద్ర
హైదరాబాద్




# ప్రధాని మోదీని కలిసిన శరద్ పవార్, సుప్రియా సూలే



న్యూ ఢిల్లీ, జులై 22: నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ చీఫ్ శరద్ పవార్, ఆయన కుమార్తె ఎంపీ సుప్రియా సూలే ఇవాళ ప్రధాని మోదీని కలిశారు. ఆ భేటీకి చెందిన ఫోటోలను పీఎంవోలో రిలీజ్ చేశారు. మహారాష్ట్ర మాజీ సీఎం శరద్ పవార్.. ప్రధాని మోదీని కలిసి మాట్లాడిన అంశం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఎన్డీఏ కూటమికి ఎన్సీపీ మద్దతు ఇస్తుందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆ ఇద్దరూ కాసేపు సరదాగా నవ్వుతూ మాట్లాడుకున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో నియోజకవర్గాల పునర్ విభజన బిల్లును మరోసారి ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తున్నది. దీని కోసం ప్రభుత్వం కసరత్తులు చేస్తున్నట్లు తెలిస్తోంది.

మూడో వంతు మెజారిటీ కోసం మోదీ ప్రభుత్వం రకరకాల ప్రయత్నాలు చేస్తున్నది. ఎన్సీపీ వద్ద 8 మంది ఎంపీలు ఉన్నారు. అయితే ఒకవేళ డీలిమిటేషన్ బిల్లును పార్లమెంట్ ప్రవేశపెడితే, అప్పుడు ఎన్సీపీ మద్దతు అవసరం వస్తుందని తాజా భేటీ ద్వారా స్పష్టం అవుతోంది. 50 శాతం సీట్లను పెంచుతామని రాతపూర్వకంగా ప్రభుత్వం హామీ ఇస్తే అప్పుడు డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇస్తామని ఇటీవల ఎన్సీపీ పేర్కొన్న విషయం తెలిసిందే. మరో వైపు ఎన్డీఏ కూటమిలో శరద్ పవార్ పార్టీ చేరేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.

### చురక

ప్రతిపక్షాల ధర్నా
ప్రధాని ఇంటి ముందు
రాజ్యానికి లాఠీచార్జి
రణరంగమే మందు.
అధికార పార్టీతప్ప
అందరికీ ఇదే రూలు
న్యాయమెవ్వరడిగినా
నిర్బంధం జైలుపాలు

–వేల్పుల నారాయణ
9440433475

నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 23-7-2026

# అధికారం ఓ మత్తు!

**అధికారం పదవిగా రావచ్చు, సంపదగా రావచ్చు, జ్ఞానంగా రావచ్చు లేదా బలంగా రావచ్చు. ఏ రూపంలో వచ్చినా అధికారం ఆకర్షణీయమైన శక్తిగా కనిపిస్తుంది.** అది సమాజాన్ని నిర్మాణం లేదా పతనం వైపు నడిపించగలదు. మనిషి మానసిక నిర్మాణాన్ని లోతుగా ప్రభావితం చేయగల శక్తి. అది మనిషిలోని మంచిని, చెడును ఒకేసారి రాబట్టగల అసాధారణమైన శక్తి. అధికారం ఒక సాధనం మాత్రమే కాదు, ఒక మత్తు లాంటిది కూడా. ఆ మత్తు పంజరంలో మనిషి ఒకసారి బందీ అయిపోయాడంటే తన స్వరూపాన్నే మరచిపోతాడు.

అధికారం మొదట మనిషికి ఒక కొత్త శక్తిని, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. దానితో తాను గొప్ప పనులు చేయవచ్చని తొలుత భావిస్తాడు. కానీ క్రమంగా అది నెత్తికెక్కి తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని తన నియంత్రణలో ఉంచుకోగలననే భ్రమను కల్పిస్తుంది. ఈ భ్రమలో నుంచి పుట్టుకొచ్చేదే 'అధికారపు మత్తు'. ఆత్మవిశ్వాసం అతి విశ్వాసంగా మారి అహంకారంగా కూడా పరిణమిస్తుంది. అప్పుడు మనిషి ఎవరి మాటా ఖాతరు చేయడు. చుట్టూ ఒక గోడను నిర్మించుకొని తనకు తాను బయటి ప్రపంచం నుంచి వేరుగా జీవించే ప్రయత్నం చేస్తాడు. క్రమంగా పొగడ్తలను నమ్ముతూ విమర్శలను ద్వేషిస్తూ మానసికంగా అందరికి దూరం అవుతాడు. మనసుకు గంతలు కట్టుకొని అధికారం నీటి బుడగలా అస్థిరమైనదని, తాత్కాలికమైనదని గ్రహించలేడు. స్వార్థ ప్రయోజనాల కోసం నైతిక విలువలకు తిలోదకాలు ఇవ్వడానికి కూడా వెనకాడడు.

### ఆశ నుండి పేరాశకు

**'ఆశ మనుగడకు, పేరాశ వినాశనానికి దారి తీస్తుంది' అనేది జీవిత సత్యం. ఇది అడుగడుగునా ప్రతి మనిషికీ వర్తిస్తుంది. ఆశ పడడం మనిషి స్వభావం.** కానీ అది పేరాశగా మారినప్పుడు తృప్తి సరిహద్దులను దాటుకుంటూ వెళ్తుంది. మనిషిని అహంకారం అంచుల్లో నిలబెడుతుంది. అధికారాన్ని పొందడానికి తొలుత శ్రమించినా, పిదప దాన్ని నిలుపుకోవాలనే బలమైన కాంక్షతో నానా గడ్డి కరుస్తాడు. 'రక్తం రుచి మరిగిన పులిలా', ఒకసారి రుచి దొరికితే చాలు వదులుకోవడానికి ఇష్టపడడు. అధికారాన్ని నిలుపుకోవాలనే తపన ఒక తీరని దాహంగా మారి నిప్పులా కాల్చుతుంది. న్యాయాన్ని, ధర్మాన్ని మరిచిపోయే స్థితికి మనిషిని దిగజార్చుతుంది. రాజకీయాల్లో, వ్యాపారాల్లో, ఉద్యోగాల్లో ఎన్నో అవినీతి కుంభకోణాలు ఈ అధికారపు మత్తు సృష్టించినవే.

### తాత్కాలిక మాయాజాలం

**అధికారం శాశ్వతం కాదు. గ్రహణంలా ఓ తాత్కాలిక సంభవం.** కొంత కాలమే కొత్తగా మురిపించే ఒక వస్త్రంలా, కాసేపు కురిసి ఆగిపోయే వర్షంలా, వేదికపై వేషానికి సరిపడేలా అలంకరించుకున్న ఆభరణంలా, ఒక అట్ట కిరీటంలా, అధికారం ఎవరికైనా తాత్కాలికమే. చుట్టూ ఉన్నవారి చప్పట్లు, ప్రశంసలు, వారు చేసే సన్మానాలు ఈ మత్తును మరింత పెంచడానికి దోహదపడతాయి. వేదికపై ఉన్నంత కాలమే ఈ హడావిడి. అధికారం రుచి మరిగిన వారు, ఆ మత్తు లేకుండా బతకలేరు. ఈ మత్తు అనుభూతికి కారణం మనిషి మెదడులో ఉప్పెనలా విడుదలయ్యే 'డోపమైన్' హార్మోన్ ప్రభావం. అరుదైనా, ఆ విశృంఖల విజృంభనలను అదుపు చేయగలిగే జ్ఞానులు కుర్చీ కాదు, కర్తవ్యమే శాశ్వతమని గుర్తిస్తారు.

### చరిత్ర చెప్పిన పాఠాలు

**అధికారం కోసం కొడుకే తండ్రిని చంపడం, అన్నదమ్ములే పరస్పర యుద్ధం చేయడం చరిత్ర చెప్పే నిజాలు.** రాజ్యాల నుంచి గృహాల వరకు, కదన రంగం నుంచి కళా రంగం వరకు ఇదే పరిస్థితి. అధికారం మత్తులో దారి తప్పిన మనిషికి చరిత్రే సాక్ష్యం.

మానవ ఇతిహాసంలో పునరావృతమయ్యే ఒక నిరంతర సత్యమే అధికారమనే మత్తు. ఇది కేవలం రాజకీయాలకే పరిమితం కాదు. కుటుంబం, సమాజం, విద్యాసంస్థలు, వ్యాపార రంగం, మత పీఠాలు.. ఏవైనా కావచ్చు, అధికార పీఠం ఎక్కడుంటే అక్కడ మత్తు పొంచి ఉంటుంది. అధికారపు మత్తు ఎలాంటి వినాశనానికి దారి తీస్తుందో వివరించడానికి చరిత్రలో అనేక ఉదాహరణలు ఉన్నాయి. అధికారం మత్తుతో కళింగ యుద్ధంలో లక్షల ప్రాణాలు పోవడానికి కారకుడై పిదప పశ్చాత్తాపంతో బౌద్ధ ధర్మాన్ని ఆశ్రయించాడు అశోకుడు. సింహాసనం కోసం అన్నదమ్ములనే హతమార్చిన ఔరంగజేబు, చివరికి చరిత్ర హీనుడిగా మిగిలిపోయాడు. హిట్లర్ వ్యక్తిత్వం అధికార మత్తుకు పరాకాష్ట. ప్రపంచాన్నంతా అల్లకల్లోలం చేసి చివరికి తన జీవితాన్ని తానే ముగించుకున్నాడు.

**సాహిత్యం సమాజానికి అద్దం. అది ఎప్పుడు మనిషిని అధికారం మత్తు నుండి మేల్కొల్పే ఔషధంగా పని చేస్తుంది.** అందుకే అధికారం మత్తుపై పౌరాణిక సాహిత్యంలో ఎందరో ఎన్నో రూపాల్లో ప్రతిబింబించారు. సింహాసనం కోసం అన్నదమ్ములను చంపాలనే క్రూరత్వాన్ని ప్రదర్శించి, చివరకు కురుక్షేత్రంలో వినాశనం చెందిన దుర్యోధనుని (మహాభారతం), తన బలాన్ని అతిగా నమ్మి, అధికార దర్పంతో సీతను అపహరించి రాముడి చేతిలో వధ చెందిన రావణుని (రామాయణం), అధికారంలో ఉన్న ప్రతి వ్యక్తీ గుర్తుంచుకోవాల్సిన ఉదాహరణలు. ఆధునిక భారతీయ సాహిత్యంలో కూడా కందుకూరి వీరేశలింగం నుంచి గురజాడ వరకు, ఎంతో మంది కవులు, రచయితలు అధికారం మత్తు ఆపాదించే దుష్ప్రభావాలను నిశితంగా విమర్శించారు. నాడు గురజాడ సంధించిన 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్!' అనే చరణాలు అధికారపు మత్తులో మునిగి దేశ సేవను మరిచిన పాలకులకు ఇవి మామూలు మందలింపులే కాదు, మహా పదునైన చురకలు.

### ఈ మత్తుకు విరుగుడు ఉంటుందా?

**అధికారంలో ఉన్నవారికి ఆత్మ విమర్శ, అంశాలపై అవగాహన చాలా ముఖ్యం.** అధికారాన్ని ఒక బాధ్యతగా స్వీకరించి, సేవ కోసం వినియోగించినప్పుడు ఒక ఆశీర్వాదంలా మారుతుంది. అధికారిగా ఎల్లప్పుడు ప్రజల మధ్య ఉండడం, వారి సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించడం ఈ మత్తుకు పరిష్కారం. తన పర భేదం పాటించకుండా నైతిక విలువలతో కూడిన సేవా దృక్పథం ఉన్న నిప్పులాంటి నాయకులే చిరస్మరణీయులు అయ్యారని చరిత్ర సూచిస్తుంది. గీత దాటిన వారిని చరిత్ర విస్మరిస్తుందనే సత్యాన్ని అధికారంలో ఉన్న వారందరూ గ్రహించాలి.



**– ఆచార్య కడారు వీరారెడ్డి**
9392447007

## బడి మొగ్గలు

అమ్మ ఒడిలోంచి బుడిబుడి నడకలు వేస్తూనే
చదువులమ్మ ఒడిలో చేరి ఓనమాలను దిద్దేది
బంగారు భవిష్యత్తుకు పునాది అందమైన బడి.

బడికి వెళ్ళనని మారాం చేసే అల్లరి బుడుతలు
అమ్మ చెప్పే అందమైన కథలతో బడికి పయనం
చిన్నారులకు ముద్దుగా చెబితేనే ఆనందం.

విద్యతో పాటు వినయవిధేయతలను నేర్పుతూ
సంస్కారాన్ని ప్రభోదించే సాంస్కృతిక కేంద్రం
విద్యార్థులనొక్కొక్క మెట్టునెక్కించే మేరుపర్వతం బడి.

పిల్లల్లో నైతికవిలువలను పెంపొందిస్తూనే
మానవతా పరిమళాలను పంచే దీపిక
సమత మమత మానవతాలను నేర్పేది బడి.
గురువు చేతిలో నిత్యం నాట్యమాడిన కట్టె

నేడు అమాయకంగా మూలకువడ్డ
గొంగళి
విద్యార్థుల క్రమశిక్షణకు శిక్షణ
మంత్రదండం



**–డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్**
9032844017

## వానా-పిల్లలూ

మా పిల్లలందరికీ గొప్ప సంతోషం కలిగించేదేంటో మీకూ తెలుసు. ఈ మాట పెద్దవారితో అంటున్నాను. మీరూ ఒకప్పుడు చిన్నపిల్లలే కదా!

అది వాన!

మబ్బులు పట్టుకువస్తాయి. చల్లగాలి వీస్తుంది. ఆకాశంలో ఓ మూల ఇంద్రధనుస్సు కనిపిస్తుంది. ఎక్కడో ఓ మెరుపు. చిన్న ఉరుము. చెట్ల మీద నుండి పక్షులు గాల్లోకి ఎగురుతాయి. మనుషులే కాదు చెట్లు, మొక్కలు, పశువులు అన్నీ వాన చినుకులకు స్వాగతం పలుకుతాయి. అప్పుడే కదా పిల్లలు పరుగులు తీసుకుంటూ ఇళ్ళ నుండి బయటకు వస్తారు. ఎవరో పాట అందుకుంటారు.




పిల్లలు నర్తించటం మొదలుపెడతారు. పిల్లలు మాత్రమేనా! నెమళ్ళు పురివిప్పుతాయి అంటారు. అలాంటి దృశ్యాలు సినిమాలలో చూశాం. ఓ రకంగా చెప్పాలంటే ప్రకృతి నాట్యం చేస్తుంది. అమ్మలు కొంతసేపు పిల్లల్ని వదిలేస్తారు. వాన పెరుగుతుంటే అప్పుడు వారు తుండు గుడ్డలు తీసుకుని వస్తారు. తలల మీద వేసి, జ్వరం వస్తుంది, జలుబు చేస్తుంది అంటూ పిల్లలు మారాం చేస్తున్నా లాక్కుపోతారు.

జ్వరం వస్తే రానీ, జలుబు వస్తే రానీ, తొలి వాన కదా. దాన్ని నిలువెల్లా తడుస్తూ అనుభూతి చెందాలి కదా! ఇది పిల్లల మనోగతం.

ఇలా రాస్తుంటే మీకు కవిత్వం అనిపిస్తుందా?

అవును. ఈ మాటలన్నీ మీ నుండి నేర్చుకున్నవే. 'వాన' గురించి రాయని కవులు, కవయిత్రులు ఎంతమంది వున్నారు? ఎన్ని వాన పాటలు. ఎన్ని 'వాన' నేపథ్యంలో వచ్చిన సినిమాలు. ఇందులో అనేక రకాలున్నాయి. కొంతమంది దర్శకులు రకరకాల వానలను అద్భుతంగా చిత్రీకరించారు కదా. ఇప్పటికీ అది గంభీరమైన లేదా పోరాట సందర్భంగా అయినా, అత్యంత విషాదమైనా వాన కురవాల్సిందే కదా.

ఇది కదా దేవుడు లేదా సృష్టి మనకు ప్రసాదించిన వరం.

అసలు వానలు కురిస్తేనే నదులు ప్రవహిస్తాయి. భూమి తడుస్తుంది. పంటలు మొలకెత్తుతాయి. కరెంట్ వస్తుంది. లేకపోతే కరువు, విలయాలు రాజ్యం ఏలతాయి. వానలు ఎప్పుడూ ఆనందాన్ని మాత్రమే తీసుకురావు. అవి వరదలను తీసుకువస్తాయి. వానా, గాలి తోడయినప్పుడు మహా వృక్షాలు నేలకు వొరుగుతాయి. ఇళ్ళు కూలతాయి. వంతెనలు కూలతాయి. అవి ఉప్పెనలుగా మారవచ్చు. అయినా వానలను మనం ద్వేషించలేం.

ప్రకృతి మనుషుల్లా కాదు. తన పనులు తను చేసుకుంటూ పోతుంది. అలాంటి నిజాయితీ మనుషుల్లో లేదు.

ఇన్ని ఎండలను భరించాం. పిల్లలందరికీ బడులు తెరవటానికి ఓ వారం రోజులు సెలవులు పెంచారు. అన్య, విదూ, నేనూ తొలకరి జల్లుల కోసం ఎదురుచూస్తున్నాం-మా పిల్లలందరితో పాటు.

ఎక్కడా మబ్బులు కనిపించటం లేదు. చల్లటి గాలులు వీయటం లేదు. నెమళ్ళు ఏమైపోయాయో తెలియటం లేదు. ఇప్పుడు పత్రికల్లో, టీ.వీ.ల్లో 'ఎల్ నినో' అంటున్నారు. అంటే ఈ సంవత్సరం వానలు కురవవు. చాలా తక్కువ వర్షపాతం నమోదు అవుతుంది అంటున్నారు. వరి పంటలు వేయకండి అని చెబుతున్నారు. ఇప్పటికే ఆహార పదార్థాలు నేలమాళిగల్లో దాచిపెట్టారం టున్నారు. అంటే కరువు పరిస్థితులు ఇప్పటికే మొదలు అయ్యాయి.

ఇవన్నీ ప్రకృతి చేస్తున్నదా? దేవుడు చేస్తున్నాడా? మనుషులు చేస్తున్నది కాదూ. శ్రీశ్రీ గారు 'దేవుడు చేసిన మనుషుల్లారా! మనుషులు చేసిన దేవుళ్ళారా! వినండి మనుషుల గోల' అంటూ ఎప్పుడో పాట రాశారని మా తాత చెబుతుంటారు. మేం కూడా విన్నాం.

'నువ్వొస్తానంటే నే వద్దంటానా' అని వాన పాట వుంది.

'రెయిన్ రెయిన్ గో ఎవే' అనే పాట వుంది. పాటలకు పరవశించి అప్పటికప్పుడు వానలు కురిసిన సన్నివేశాలున్న సినిమాలున్నాయి. పిల్లలూ ఎన్ని వానలు కురుస్తున్నా 'గో ఎవే' అని పాడకండి. పిల్లలూ, దేవుళ్ళూ ఒకటే అంటారు. మీవి వేదవాక్కులు. తథాస్తు దేవతలుంటారు అంటారు.

మనుషులకు ముందుచూపు వుండదా? ఎప్పుడూ పుష్కలంగా వానలు కురవవు. ఇది ప్రకృతి సూత్రం. చీమలు ఎందుకు ఆహారం నిల్వ చేసుకుంటాయి. మనుషులు కొందరు డబ్బుని, సంపదలను మాత్రం పోగు చేసుకుంటారు. అందుకు ఎలాంటి పనులయినా చేస్తారు. అంతేకాదు మనకు ఈరోజు గడవటం కావాలి. రేపు గురించిన ఆలోచనలు రావు. వచ్చినా పట్టించుకోరు.

మనం చెట్లు నరుకుతాం. వంతెనల నిర్మాణంలో, రహదారుల నిర్మాణంలో అవినీతి. అందులో ఎవరి వాటాలు వారికి. ఇక్కడ శిక్షలు వుండవు. భయం వుండదు. ఎవరికి అందింది వారు దోచుకుంటారు. ఏ వాన వచ్చినా, రాకున్నా. వరదలు, ప్రళయాలు వచ్చినా మొదట ఆ ప్రభావం సామాన్యుడి మీద పడుతుంది. ఎందుకయ్యా మీకు అణ్వాయుధాలు, బాంబులు, మిసైళ్ళ-రకరకాల ఆయుధాలు. నదుల్ని అనుసంధానం చేయండి. తుఫాన్ దిశలను మార్చండి. ఎడార్లలోనూ మొక్కలు మొలిపించండి. అంత ఆధునికత మీరు అందిపుచ్చుకున్నారు కదా!

అందుకే ఇప్పుడు వానలు, ఎండలు, చలి, మనుషుల మీద పగబట్టాయి. ఒక చిన్న మార్పుతో మనుషుల ప్రపంచం కుదేలు అవుతుంది. ప్రకృతి శాశ్వతంగా మనుషుల మీద పగబట్టదు. ఎందుకంటే ఈ సృష్టిలో మనుషులు ఒక్కరే లేరు. వృక్షజాతులు, జంతుజాలం, పశుపక్ష్యాదులు, ఇంకా జీవ, నిర్జీవ పదార్థాలుగా కనిపించే మహా ప్రపంచం వుంది. కేవలం మనుషుల కోసం మిగతా ప్రపంచాన్ని ప్రకృతి కోల్పోవటానికి ఇష్టపడదు. అందుకే చిరునవ్వుతో మానవ లోకానికి ఓ సందేశం ఇచ్చింది.

'మీ మరణ శాసనాన్ని మీరు రాసుకోండి. మీరు రెండు ప్రపంచ యుద్ధాలనుండి గుణపాఠాలు నేర్చుకోలేదు. ఎప్పటికప్పుడు మూడో ప్రపంచ యుద్ధం అంచుల దాకా వెళ్ళి వస్తున్నారు. గుర్తుంచుకోండి మీ మానవజాతికి అదే అంతిమ యుద్ధం.'

అవును ఇప్పుడు మాకూ అనిపిస్తోంది.
రేపు మనుషులు వుండరు.
ఈ ప్రపంచం వుంటుంది!



**– పి.చంద్రశేఖర అజాద్**
92465 73575

## ఆ చేతిని నా నుదుటి కానించి..!

దుంఖ ద్వీపం మీద ఎగదన్నే కన్నీటిని
ఆరబెట్టుకుంటున్నాడా!
తెరచిన అరచేతిలో అతని మనసు
వుందా, బుద్ధిగా చెప్పినట్లు వింటుందా
అక్షరాలకు సాముగరిడీలు నేర్పిన కలానికి
వేదాంత కాలమొచ్చి, ఒళ్ళో వాలి, వోదార్చుతుందా.

పండు బారిన జులపాల చుట్టూ బిగించిన తెల్ల రుమాలు,
మోకాళ్ళను తాకని నల్ల నిక్కరు
వొదులుగా వూగే ముతక అంగి
కాళ్ళ పటిమను పరీక్షించే వాకరు
మంచం మీద మూర్తీభవించిన దృశ్యాన్ని
ఏ కన్నూ భరించదు.

కల గన్నది సాక్షాత్కరింప జేసుకున్న సాధకు డాయన
ఒక ప్రపంచానికి సరస్వతీ సమ్మాన్ అధినాయకు డాయన
పద్యం శివుడు, శివుడు పద్యం
జంట మాటల ఏక రూప సమ్మోహనమే
ఎవ్వరెవ్వరో ఎందరెందరో ఆత్మీయ చేతి స్పర్శ తో
గలగలా కవిత్వ పాయలై ప్రవహించటం,
కూడలి, తల్లి కోడి పదాలు అతన్ని చూసే పుట్టటం
మధురమైన, మహత్తరమైన స్థిరపడ్డ సంగతులే.
సముద్రం నుంచీ హిమాలయం వరకు
గగనమంత తలతో కవిత్వ శ్వాస
నింపే పనిలో
విషాద మేఘ మొకటి అడ్డుకుంటున్నది.
'సృజన'కారుడు ఓ పక్క
'రక్తం సూర్యుడు' మరో పక్క
గ్రహణ కారణాలు ఏవేవైనా
అక్షర లోకం దిక్కు అందక
మూగ వోతున్నది.
విధ్వంసం మాట ఎత్తాడు
అప్పుడైతే బయట
ఇప్పుడు లోపల?.
బండ్ల కొద్దీ తరలి పోయిన తన పుస్తక సంపద
ఎన్నో స్వేచ్ఛా వూహలకి ప్రాణం పోస్తూ వుంటది.

సలువ గాలులు తలుపు తట్టి,
ద్రవీభూత ప్రేమతో అతన్ని పలకరిస్తుంటయి
గద్గధ కంఠం క్రమేపీ తేరుకొని
పద్యం అందుకుంటది.
బాధా, అక్షరం
ఒంటరిగా వుండలేవు
ఇప్పటి జంట పదాలవి?!

(కంశ్రీ తోడుగా శివారెడ్డి గారిని చూశాక)



**-దాసరాజు రామారావు**
సెల్:96182 24503

పుస్తక సమీక్ష

## అలుపెరుగని అక్షర ప్రియుడు మన గోపీ మాస్టారు






ప్రతులకు: **డా॥ ఎన్.గోపి**,9391028496

ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ఆయన సొంతం అయ్యింది. పత్తిపాక మోహన్ అన్నట్లుగా మహత్వ కవిత్వ దీక్షతో కవిత్వం వ్రాస్తున్న నిరంతర చలనశీలి డా॥ఎన్. గోపిగారు. తెలుగు విశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్స్‌లర్‌గానూ, వివిధ విశ్వ విద్యాలయాలకు వైస్ ఛాన్స్‌లర్‌గానూ బాధ్యతలు ఇన్‌చార్జిగా నిర్వహించారు. ఇదంతా వారి తల్లిదండ్రులు నక్క లక్ష్మమ్మ, చెన్నయ్య గార్ల పుణ్యఫలమే. ఇక వారి శ్రీమతి అరుణ గారి ప్రోత్సాహం అంతా ఇంతా కాదంటే నిజం మరి. ఆ రోజుల్లో పిల్లల పత్రికలు ఎన్నో వచ్చేవి. చందమామ, బాలమిత్ర, బుజ్జాయి, ట్వింకిల్, చంపక్, ఇంకా ఎన్నెన్నో పత్రికలు వచ్చేవి. అలాగే బాలబాట అనే పత్రికలో రమణమ్మగారు వీరి రచనలు ప్రచురించారు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లుగా 1948 లో పుట్టిన మన గురువు ఏడవ తరగతి విద్యార్థిగానే మొదలు పెట్టారు. బాలకవిగా ఆనాడే ఒక శతకం రాసారు. సరే ఇక గోపీ గారి రచనలు చదవని సాహితీవేత్త ఉండరు అంటే అతిశయోక్తి లేదు. 57 గ్రంథాలు అచ్చయ్యాయి. అందులో కవితలు, విమర్శలూ, పరిశోధనలూ, యాత్రా చరిత్రలు, అనువాదాలూ, ఇలా ఏది కాదు కవిత కనర్హం అన్నట్లుగా, గోపీగారు చాయ్ దుకాణంలో చాయ్ త్రాగుతూ కవిత రాస్తారు. సరే! అదలా వుంచితే, తెలుగు సాహితీ లోకంలో స్థిరస్థాయిగా నిలిచే పని ఒకటి చేశారు. అదే **'నానీలు'** సృష్టించడం. నానీలకు 50 ఏళ్ళుదాటాయంటారా? గోపీగారి ప్రసంగాలు కూడా అంత గొప్పగానే వుంటాయి. ఆయన జన్మతః అదృష్ట వంతులన్నమాట. ఇం కొక సద్గుణం వీరి వద్ద వుంది. ఎంత చిన్న వాడైనా, కవిత ఎలా వున్నా, అతగాడిని ప్రోత్సహించి, తనంత వాడు కావాలని దీవించడం గోపి-అరుణ దంపతుల ప్రత్యేకత. నా సమీక్షల గ్రంధాన్ని చూసి వెంటనే ఫోనుచేసి అక్షర అక్షతలుగా మాటల పూలు జల్లిన రోజునాకు నాకు గుర్తుంది. సరే ఈ గేయాల మాటకొస్తే, ఆయన పిల్లవాడిగా వున్నప్పుడూ రాసినవే కదా అని చిన్నచూపు కూడదు. అంత బాగున్నాయి. అందుకే పత్తిపాక ఫౌండేషన్- గరిపెల్లి ట్రస్ట్ వారు, కూరెళ్ళ శ్రీనివాస్ చేత అందంగా బొమ్మలు వేయించి మరీ ప్రచురిం చారు. ఇవి 1965-66లో వ్రాసినవి, అంటే ఈ పులివర్తి హైదరాబాదులో కాలుబెట్టి సంవత్సరం అయిందన్నమాట. ఈ కవితల్లో అమ్మమ్మ అప్పచ్చులూ, తాతయ్య ఇచ్చిన కొత్త చొక్కాలు, బూచులు, తాతబొజ్జలూ, పిలకలూ, రాజకుమార్తెలూ, పువ్వుల గౌనులూ, టక్కరి బావలూ, లడ్డూలూ, అప్పడాలూ, పొట్టిబావ, చందమామ, నిక్కరు జేబులు, జరి కుచ్చులు, అద్దము-ఆకతాయి, బొమ్మలు, చిట్టి పాపాయి నవ్వులు, మంకి పట్టులూ, మారామూలూ, ఎలుకమ్మపెళ్లి, కీలుగుర్రం, ఆపైన చివరగా ముద్దివ్వనీ కింక నువ్వెన్ని చెప్పినా, నేను వినవే అమ్మ అంటూ ముద్దుగా ముగించారు మన చిన్ని గోపీ బాబు. ఈ బాలగేయాలు చిన్నప్పుడు రాసినా, నేటికీ ఆ నేటివిటీ గోపిగారి రచనల్లో అలాగే వుంది. వెళ్తు వెళ్తూ ఒక కవిత రాస్తారు. తన చుట్టూ పరిశీలిస్తారు.

మనుష్యులనూ మనస్తత్వాలనూ స్టడీ చేస్తారు. ఆపైన ఏమి రాసినా కనుల కద్దుకుని ప్రచురించే పత్రికలు కోకొల్లలు. మా గోపీగారి కవితలు హాట్ కేకులుమరి. మా భువనగిరి తెలంగాణ బిడ్డ మరో నారాయణరెడ్డి అంటే అతిశయోక్తి కాదు మరి. ఇక మీరు కూడా గోపిగారి కీలుగుర్రం ఎక్కుండి ఆలస్యం చేయకుండాను.



**– డా॥ పులివర్తి కృష్ణమూర్తి**
సెల్:9949092761

## దువా పూర్తికాని చేతులు

గుమ్మం దగ్గర వేలాడే దీపానికి
ఎవడు పేరు అడుగుతాడు?
వెలుగు కావాలంతే...
గాలి దెబ్బలు
దాని గుండె మీద పడతాయా,
మంట మీద పడతాయా అని
ఎవరూ లెక్క పెట్టరు.
అలమార మూలన
మడతపడ్డ చీరలు లెక్కపెడతారు...
మడతపడ్డ కలలను
లెక్కపెట్టే హిసాబ్
ఏ దఫ్తర్‌లోనూ ఉండదు.
ఒక నవ్వు...
గోడలోని పగుళ్ల మీద
సున్నం పూసినట్టే.
దగ్గరగా చూస్తేనే తెలుస్తుంది?
ఇల్లు ఇంకా కంపిస్తోందని.
గుండె లోపల
ఎంత ఉప్పు పేరుకుందో...
సముద్రానికైనా తెలీదు.
కళ్ల దాకా వచ్చి
తిరిగి వెళ్లిపోయిన కన్నీళ్లు
దువా పూర్తికాని
చేతుల్లా ముడుచుకుని పడుంటాయి.
పొద్దున్నే కట్టుకునేది
అందాన్ని పెంచే చీర కాదు...
నిన్నటి అలసటకు
ఇవాళ్టి రంగు తొడిగిన ఓపిక.
అందరికీ కనిపించేది
చక్కని ఇల్లు.
కనిపించనిది?
ప్రతి గోడను
భుజాలతో మోసే
పునాది నొప్పి.
మౌనం అంటే...
ఖాళీ కాదు.
తాళం పడిన మసీదు.
అజాన్ వినిపిస్తుంది...
లోపలికి వెళ్లే తలుపు మాత్రం
ఎప్పుడో మూసుకుపోయింది.
ఎవరైనా అడుగుతారు...
"అంతా ఖైరియత్‌నా?"
పెదవులు చెబుతాయి...
"అల్హమ్దులిల్లాహ్..."
గుండె మాత్రం
తస్బీహ్ దాణాల్లా
ఒక్కో నిట్టూర్పును
వేళ్ల మధ్య తిప్పుకుంటూనే ఉంటుంది.
కొండలు
ఏడవాలని నిర్ణయించుకుంటే
నదులవుతాయి.
కొందరు స్త్రీలు కూడా అంతే...
వాళ్లు మాట్లాడాలని నిర్ణయించుకుంటే
కవితలు కావు...
చరిత్రలో దాచిపెట్టిన
అన్ని మౌనాలకూ
.ఉహుద్ యుద్ధంలో
ఖడ్గం పట్టిన
నూసైబా బింత్ కాబ్
గొంతుకలవుతారు.



**-షేక్. నసీమాబేగం**
9603567011

## పూలప్రయాణం

ఎరుక,
చీకటినూనెని పీల్చుకొని వెలుగెత్తే చూపుదీపం,
తెలివిడి,
శత్రుత్వ మరకను చెరిపి స్నేహించే హస్తచాలనం,
సోయి,
అమానవీయ ముద్రను తరిమి,
మానవత్వమయ్యే మనిషితనం,
చైతన్యదారి అంటే
ముళ్ళను తొలగించుకుంటూ పోయే
పూలప్రయాణం!



**-డా॥ కాసర్ల నరేశ్ రావు**
9441406252




ఆదివారం ప్రగతినగర్ సుందరయ్య భవన్‌లో సత్యం గంజి రచించిన "అమ్మకు కోపం వచ్చింది" వచన కవితా సంపుటిని ప్రముఖ సినీ గీత రచయిత శ్రీ వెనిగళ్ళ రాంబాబు మరియు యువ రచయిత శ్రీ హర్ష ఆంగ్లంలో రచించిన కథల సంపుటి story about true friend ship ను ప్రముఖ కవి, నటుడు కాంచనపల్లి రాజేంద్రరాజు ఆవిష్కరించారు. వేదికపై మౌనశ్రీ మల్లిక్, డాక్టర్ శ్రీ లక్ష్మి, శ్రీమతి వనజా బలుసాని, మల్లయా చారి, డాక్టర్ గోగు వేంకటేశ్వర్లు, బి.వేంకట్రామయ్య పాల్గొన్నారు.








# సినారె పై కవితామాలిక ‘కవితా విశ్వంభరుడు’

పుస్తక సమీక్ష

మారుతున్న కాలానికి అనుగుణంగా కవితా రీతుల్లోనూ అనేకానేక ప్రయోగాలు చేసి నవ్యతను తెచ్చిన ప్రయోగశీలి డాక్టర్ సి నారాయణరెడ్డి. ప్రముఖ కవులు, వర్ధమాన కవులు, కవయిత్రులు ప్రాతఃస్మరణీయులుగా భావించి అలాంటి సాహితీవేత్త ను స్మరించుకోవడం సహజం. ఈ నేపథ్యంలో.. “సినారె కవిత్వం లో ప్రయోగా లు- ప్రతీకలు” అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం రాసి ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నుండి డాక్టరేట్ పట్టా అందుకున్న కవి విమర్శకులు, రచయిత తిరునగరి శ్రీనివాస్ తానే సంపాదకులుగా **‘కవితా విశ్వంభరు డు’** అనే కవితా సంకలనాన్ని తీసుకొచ్చా రు. ఈ సంకలనంలో 71 మంది కవులు, కవయిత్రులు సినారె సాహిత్యాన్ని విశ్లేషిస్తూ రాసిన కవితలు ఉన్నాయి.

తొలి కవిత కవి గంటా మనోహర్ రెడ్డి రచించిన **“అంతటా మీరే”** ఆకాశమంత విస్తరించారు.. విశ్వంభరు డుగా మీరు వెదజల్లిన జ్ఞాన పీఠికలు వేగుచుక్కల్లా వెలిగిపోతుంటే, మీరు లేరనే మాట ఎలా నమ్మాలి? ‘- అంటూ మనో హర్ రెడ్డి సినారెను స్మరించారు. **“నిన్న లేని అందమేదో నిదురలేచెనెం దుకో”...** పాట రేడియోలో వింటున్నప్పుడు కవి కనపడడు.. కానీ కవి అంతరాత్మ శ్రోతలకు బోధపడుతుంది. నేను మొదటి సారి కందపద్యం రాసి సినారె గారికి పంపిం చాను... **‘నీ కవితా జిజ్ఞాసను అభినంది స్తున్న’** అని మూడు ముక్కల్లో ఆయన ప్రత్యుత్తరం ఇచ్చారు...నా ఆనందానికి అవధులు లేవు’ అంటూ కవి కందుకూరి శ్రీరాములు ‘సినారె’ అనే కవితలో చెప్పారు. “తెలుగు సాహితీ మాగాణాన కావ్య సృజనలు చేసిన కర్షకన్మణి.. జ్ఞానపీఠాన్ని అధిరోహించిన విధ్వన్మణి” అని కవి కెఎస్ అనంతాచార్య ‘కదిలించిన కలం’ అనే కవితలో పేర్కొ న్నారు. ‘ఆ కలం తెలుగువారి ఆత్మగౌరవం.. ఆ గళం నిత్య నూతన చమత్కార భరితం’ అని చెబుతూ కవి డాక్టర్ రామక కృష్ణమూర్తి ‘తెలుగు భూషణుడు’ అనే కవిత రాశారు. “పద్య కావ్యాల పునాదులపై అలవోకగా ఆకాశ హర్మ్యాలు నిర్మించిన అభినవ గీతాచార్యులు... కలాన్ని కరవాళంగా ఝులిపిస్తూ రసమయ భావచంద్రికలు విరజిమ్మిన అక్షర చంద్రగుప్త మౌర్యులు..” అంటూ అద్వితీయమైన భావాలతో సినీ గేయకవి డాక్టర్ వెనిగళ్ల రాంబాబు “సినారే అంటే” అనే కవితలో ప్రస్తుతిం చారు. కవి డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు రాసిన “మూడక్షరాలు” అనే కవిత “సినారెతో తొలి పలుకులు రాయించుకున్న పుస్తక రచయితల హృదయాలు కన్నీరు నింపుకుంటాయనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు.” వీచే గాలి ఆయన గజల్ అయితే, వికసించే పుష్పం ఆయన చేసే శృతి అయితే,పక్కకి ఒరిగిన పరిమళమే ఆయన నాదం అయితే... ఆయనో కొత్త ఋతువు, సాహితీ ఋషి తెలుగు భాషా సారస్వత జయకేతనం.. విశ్వగీతమై విశ్వవ్యాప్తమై పరుచు కున్న ఈ సృష్టి ఆయన కవిత్వం” అంటూ కవి నామాల రవీంద్ర సూరి అద్భుతమైన భావ విన్యాసం ప్రదర్శించారు ఆయ నో కొత్త ఋతువు” అనే కవితలో. ఈ అనంతమైన సాహిత్యం లో వెలిగే జ్యోతి అసాంఘిక శక్తు లపై ఉరిమిన మహాద్యుతి” అని పేర్కొంటూ “మహా ద్యుతి సినారె” అనే కవితను రాశారు సినీ గేయకవి మౌనశ్రీ మల్లిక్. ‘పల్లె పరిమ ళత్వం నింపుకొని మట్టిని ముద్దాడిన తెలంగాణ తేజం సినారే అని చెబుతూ మీ బాటలోనే యువ సాహితీ వనం.. మీ యాదిలోనే తెలుగు సాహితీ మాగాణం’ అని కవి ఉండ్రాళ్ళ రాజేశం “మీ బాటలోనే” అనే కవితలో రాశారు. “మాతృభాషకు మనిషి శ్వాసకు తల్లి బిడ్డల సంబంధం ఉందని నిరూపించి జనుల హృదిని గెలిచిన మా జ్ఞానపీఠం నీవు.. సినారేగా సినీ వినీలాకా శంలో నిలిచిన అభినవ మా అక్షర కర్ణుడవు నీవు” అని భాష పట్ల సినారెకు ఉన్న నిబద్ధతను తెలుపుతూ, బోధనలో మాతృభాష ప్రాశస్త్యాన్ని ఎంత గొప్పగా చెప్పేవారో కవిఅక్షరం ప్రభాకర్ రాసిన “అక్షర కర్ణుడు”అనే కవిత చదివితే తెలుస్తుంది.

తమ నీడల్ని చూసి తామే కుమిలిపోతున్న కాలంలో తానే వటవృక్షమై నీడనిచ్చిన విశ్వమానవుడుగా సినారెను కీర్తిస్తూ కవి వనపట్ల సుబ్బయ్య “వెన్నెల పాట” కవిత రాశారు. “ప్రాచీనతకు ప్రతీక,ఆధునికతకు పతాక, తెలుగు భాష పట్టు తెలిసిన తెలివైన తెలంగాణ తేజం” అని “సహజ కవి” కవితలో సుతారపు వెంకట నారాయణ సినారెను కొనియాడారు. “వగలరాణివి నీవే” నంటూ అక్షరాన్ని వంపులు తిప్పిన సముద్రు డు గా గుర్తు చేసుకుంటూ కవయిత్రి యలమర్తి అనురాధ “పాటల రారాజు” అనే కవిత రాశారు. “తెలంగాణ మాగాణంలో ఆధునిక తెలుగు కవి దిగ్గజంగా పేర్కొంటూ మాండలిక పదాలకు పట్టుకొమ్మయిన పద్మశ్రీ.. తెలుగును వెలిగించిన జ్ఞానపీఠమా నీవు ఎప్పుడు చిరస్మరణీయుడవే...” అని కవయిత్రి పత్తేని వసంత “సాహితీ రత్నమా...” అనే కవితలో సినారెను కీర్తించారు . ఆధునిక తెలుగు సాహిత్యంలో సంప్రదాయాలు చూపి ప్రయోగాలు,ప్రతీకలు సృష్టించి లక్షలాది సాహిత్య అభిమానులకు సినీ సంగీత ప్రియులకు చెరిగిపోని నిలువెత్తు సంతకానివి నీవు”... అని సినారెను “చెరిగిపోనిసంతకానివి” అనే కవితలో కవి, విమర్శకులు డాక్టర్ గన్నవరం వెంకటేశ్వర్లు స్మరించుకున్నారు. “సాహితీ నగపు ప్రతి మెట్టు నీ చేతి కుంకుమ దిద్దుకున్నదే ఎవరివయ్యా నీవు? శాఖోప శాఖలుగా విస్తరించిన నీ కీర్తి పతాకను దిగంతాలకు ఎగరేసిన విశ్వంభరుడవా..?” అంటూ ‘ఎవరివయ్యా నీవు’ అనే కవితలో మధుర పంతుల లక్ష్మి సినారె ను సంబోధించారు . ‘సదా మీ జ్ఞాపకం పదిలం ‘ అనే కవితలో కవి భోజన్న గారి చంద్రశేఖర శర్మ “మా మదిలో మీ జ్ఞాపకాలు నింపి కానరాని లోకానికి ఎలా వెళ్లారు?.. కవిత్వాన్ని ఒంటరి చేసి ఇలా వదిలి వెళ్తారా? మళ్లీ వస్తారా మా సినారె...మీ కలంతో మరింత సాహితీ సేద్యం కొనసాగిస్తారా?’... అనే ప్రశ్నలు పాఠకుల గుండెల్ని తడి చేస్తాయి. “విశ్వ కవికి వందనం” అనే కవితలో హనుమాజీపేట ముద్దుబిడ్డగా తెలుగు పాటల రారా జుగా ప్రశంసిస్తూ సాంప్రదాయ విధేయతలతో పెరుగు మీగడలు తిన్నట్టుగా తేనెలొలుకు తెలుగును విశ్వానికి తెలిపిన విశ్వకవివి “ అంటూ కీర్తిస్తారు కవయిత్రి లింగాల రజని. ‘సమరసతే మానవత్వమని, మానవ ప్రస్థాన రహస్యాలను విప్పి చెప్పిన వాడుగా ప్రగుణశీలిగా సినారెను కవి స్తంభంకాడి గంగాధర్ ‘ ప్రగుణశీలి” కవితలో చెప్పారు.



ఈ కవితా సంకలన సంపాద కులు,కవి, విమర్శకులు డాక్టర్ తిరునగరి శ్రీనివాస్ రచించిన ‘యశస్వి సినారె’అనే కవిత. డాక్టర్ నారాయణ రెడ్డి సాహిత్య సృజ నాత్మ క భావధారలో ఒదిగి ఉన్న తాత్విక తను, ఆయన రచనల్లో ఉన్న విశిష్టతను, పాఠకులకు ఒక చైతన్య శిల్పమై.. దృశ్య కావ్యమై చూపి స్తుంది. ‘మరణం పైనే రణమన్న కవితా ధీర త్వం.. కొనగోటి మీదే జీవితమన్న అస మాన తాత్విక సందర్శనం.. అభిన వ తెలుగు కవితా శిల్పం.. వస్తు రస భావ ధ్వనుల సమ్మే ళనం.. లక్ష్యం చేరి న సాహితీ తపస్వి.. .సినారె సమస్త చైతన్య సారథ్య యశస్వి’ అంటూ అద్వితీయ భావ పరంపరతో కవితను ముగిస్తారు. ‘మాటకు దండం పెడతా... పాటకు దండం పెడతా.. మాటను పాటను నమ్మిన మనిషికి దండం పెడతా.. అన్న సినారె మాటలను గుర్తు చేసుకుంటూ “ఆ ప్రతిభకు దండం పెడతా” అనే కవితను గుండ విూది కృష్ణమోహన్ రాశారు. నారాయణ రెడ్డి కవిత్వాన్ని, ఉపన్యాస శిల్పాన్ని..ఆయన మాటల్లోని, పాటల్లోని చమత్కారాన్ని ప్రశంసిస్తూ “గుగ్గురువుకు దండం..” కవితను రాశారు కవి, రచయిత అవుసుల భాను ప్రకాష్ . రాగయుక్తమైన గేయాలు, తాళబద్ధమైన గీతాలు, ప్రామాణి కంగా నిలిచిన వేలాది పాటలు సాహితీ ప్రపంచానికి అందించిన సినారెను ఒక శిఖరంగా కీర్తిస్తూ “అతనే ఒక శిఖరం” కవితను ఆకుండి విజయ్ రాశారు. “నీ ప్రతి రచనా మాకు నిత్య పఠనీయం.. నీ ప్రతి గజల్ మా ఎదలకు కమనీయం..నీ ప్రతి పదం మా స్మృతి పధాన పదిలం”... అంటూ కవయిత్రి వల్లాల విజయలక్ష్మి రాశారు. ‘నవరసాల పాళీ’అనే కవితలో చంధో రహస్యమెరిగిన భూగోళమంత మనిషి గా సినారెను కవయిత్రి నోముల వనితారాణి కీర్తించారు. “సాహిత్యపు మాధుర్యం” అనే కవితలో “ఆధునిక ఆంధ్ర కవిత్వంలో సంప్రదాయములు ప్రయోగములు అనే పరిశోధన వ్యాస గ్రంథం ఒక నిత్య నూతన ప్రయోగంగా చెబుతూ తెలుగు సాహిత్యపు మాధుర్యాన్ని అందించిన అక్షర తపస్విగా విశ్వంభరుడుగా సినారెను ప్రశంసిస్తూ డాక్టర్ దివిటి అంజనీ దేవి ప్రస్తుతించారు .

“రస రమ్య గీతాల నెల రాజై కవితా సేద్యం చేసిన క్రాంతి దర్శిగా, నిలువెత్తు సంస్కృతి రూపం గా సినారె మూర్తిమత్వాన్ని “సినీ వినీలాకాశం లో” అనే కవితలో కవి గడ్డం లక్ష్మయ్య కొని యాడారు . “అంగారాన్ని కురిపించగలడు, అమలిన శృంగా రాన్ని ఒలికిం చగ లడు, మధ్య తర గతి జీవితాల్లో నుంచి, కన్నీటిని మున్నీటిని తన కలంలో పోసి కవిత్వీకరించాడు ” అని కవయిత్రి రాపోలు అరుణ స్వామి ‘మన సినారే’ అనే కవి తలో పేర్కొన్నారు. “లతకు అల్లుకున్న తీగలు.. హరిత వర్ణాల కాంతులు సినారె గజళ్లు, కోటి తారల వెలు గులు...అని “తెలుగుకు వెలుగు” కవితలో కవయిత్రి రజిని కులకర్ణి రాశారు. కవి డాక్టర్ బొడ్డోజు మల్లయ్య చారి రాసిన కవిత “విశ్వంభరుడు” కవితలో సమగ్ర సాహిత్య ఋషిగా అభివర్ణించారు. “ప్రపంచ పదుల చరుపులతో పదాల విరుపులతో... జన జాగృతం గావించిన ఓ వాక్సుధానిధి!.. ఓ హనుమాజీపేట ముద్దుబిడ్డడా...! అని కవి కిలపర్తి దాలినాయుడు “అక్షరమాంత్రికుడు” కవితలో నారాయణ రెడ్డి గూర్చి రాశారు. “ తెలుగు వెలుగులు ప్రపంచ శిఖరంపై ప్రసరింప చేసిన ఓ సూర్య తేజ...కవి సార్వభౌమ!!”.. అని “కవిసార్వభౌముడు” అనే కవితలో కవి శనిగరపు రాజమోహన్ అన్నారు. “గంభీర వదనుడు” అనే కవితలో కవయిత్రి పత్తిపాటి రూపలత “ప్రశాంత గంభీరతను/ పై పంచగా వేసుకుని / సాహిత్య సంద్రాన్ని /కలం తెడ్డుతో అవలీలగా దాటిన/ అజరామర కీర్తి చంద్రిక అతడు “..అని చెప్పారు. “ ఆయన కవిత్వం” అనే శీర్షికతో కవయిత్రి డాక్టర్ గంజి భాగ్యలక్ష్మి రాసిన కవిత అద్వితీయమైన భావ పరంపరతో సాగింది. ఈ కవిత లోని కొన్ని పంక్తులు “పేదల కన్నీటిలో తడిసిన కష్టం /పెద్దల పెదాలలో పలికిన జీవిత సత్యం/ ఆయన కవిత్వం/పాడిపంటల్లో తీరిన పాలమీగడ / పచ్చని పొలాల్లోని పడుచుల అందం ఆయన కవిత్వం”.. అన్నారు. “తెలుగు కవితా తేజం “ శీర్షికన కవి ఉడుత సంపత్ రాజు రెండు కందాలు మూడు ఆట వెలదులతో సినారె కవితా నైపుణ్యాలను, సాహిత్య గరిమను కొనియాడారు.” పుట్టెను తెలుగమ్మ యొడిన/ కట్టెను కవనపు భవంతి కడు హృద్యముగన్ / పుట్టెడు ప్రక్రియలొ నర్చి / దిట్టగు కవి మా సినారె తెల్గు భాషకున్ “ అంటారు. ‘మానవతను కవితా పతాకగా చేసుకుని చీకటిపై రణం చేసిన ధీరత్వం, మార్చే తన తీర్పు అన్న సాహసం సినారెది’ అని డాక్టర్ టి చక్రధర స్వామి “మానవతా పతాక” కవితలో వ్యక్తం చేశారు.” ఇంటి పేరు సింగిరెడ్డి నుండి చైతన్యం వరకు ప్రాకి అక్షరాల గవాక్షాల్లోంచి..వెన్నెల ఆకాశంలోకి ఆరోహణ చేసిన కవితా బ్రహ్మ గా... తాను రాసిన “ కవితా రూపం” కవితలో కవయిత్రి డాక్టర్ నందవరం మృదుల అక్షరీకరించారు. కవి డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు రాసిన కవిత “ అతని కవిత “ లో భావాలతో అల్లుకున్న కవిత్వమే అతని కవిత అన్నారు. తెలుగు సాహిత్యానికి వన్నెతెచ్చిన నీ కలం నవ చైతన్య రథంగా ప్రశంసిస్తూ కవయిత్రి డాక్టర్ దేవులపల్లి పద్మజ “ అమరం అమరం “ అనే కవిత రాశారు. “ మాటకు ‘దండం.. పాటకు దండం మాటను పాటను నమ్మిన మనిషికి దండం “ అన్నారు సినారె. ఇదే భావాన్ని వ్యక్తం చేస్తూ మానవతా కాంతులు పంచిన విశ్వ కవిగా.. కీర్తిస్తూ కవి, గాయకుడు దేవత సుధాకర్ ‘కలకాలం నిలిచే కవి’ అనే కవిత రాశారు. డాక్టర్ యజ్జల ప్రవీణ్ “ కవితా దిక్సూచి “ అనే కవితలో “ అక్షర ప్రకాశి కవితా దిక్సూచి, నిరంతర స్ఫూర్తి అని పేర్కొన్నారు.

‘ మీ నోటి ప్రతి మాట కవితా ప్రవాహమై సాగింది భళారే సినారే’ అనిపించుకున్నారు “.. అని డాక్టర్ బోనాల ప్రకాష్ “భళారే సినారె “ అనే కవిత రాశారు. నిరుపేదల గుండెల్లో అణగారిన వర్గాల ఆర్తిలో సినారే ఉన్నాడంటూ స్మరించుకున్నారు ప్రొఫెసర్ ఎన్ లక్ష్మీ అయ్యర్. హనుమాజీపేట మట్టిలో పుష్పించిన అగ్నిపువ్వు/ విశ్వ కదలిపై వికసించిన అరుణోదయం” అంటూ అద్వితీయమైన భావ పరంపరతో కవి డాక్టర్ పెద్ది వెంకటయ్య “ ముఖచిత్రం” అనే కవిత రాశారు. తెలుగు సాహిత్య రంగమే కాక వివిధ రంగాల్లో గొప్ప ప్రతిభను చూపి చెరగని ముద్ర వేసిన మరపురాని మహాకవిగా తన కవితలో కవయిత్రి డాక్టర్ చీదెళ్ల సీతాలక్ష్మి వ్యక్తం చేశారు. కవయిత్రి డాక్టర్ గుమ్మడి రామలక్ష్మి తాను రాసిన “ అజరామర కవన శిల్పి” అనే కవితలో “ గేయ కవితకు కొత్త నడకలు నేర్పిన వచన హరివిల్లు/ మాటల పేటల పాటలకు/ పురుగు విప్పిన మేఘంపు జల్లు / శిఖరాలు లోయలు ముత్యాల కోకిలను ఓలలాడించిన సవ్యసాచి” అని కవిత్వీకరించారు. తరతరాల తెలుగు వెలుగును రేపటి వైపు నడిపించావు.. తెలుగు కవితా నందనంలో కర్పూర వసంతమై నిలిచినావు ఓ కవివరేణ్యా.. అందుకో ఈ నీరాజనం “.. అని కవితా స్వాప్నికుడు కవితలో డాక్టర్ చింతల రాకేష్ భవాని వ్యక్తం చేశారు. కవితా విశ్వంభరుడు సంకలనంలో కవి వడిచర్ల సత్యం రాసిన మణిపూసలు పేర్కొనదగినది. ఈ మణిపూసలు కవిత్వం నాలుగు పాదాలతో మాత్ర చందస్సుతో నడుస్తుంది. ఒకటి రెండు నాలుగో పాదం 10 మాత్రలతోనూ మూడవ పాదం 12 మాత్రలతోనూ సాగుతుంది. ఇందులోని కొన్ని కవితా పంక్తులు..” మాతృభాష సినారె/ మధుర కవిత సినారె/ మహిలోపల వెలిసినట్టి / మహాకవియు సినారె” అంటూ ఎంతో హృద్యమైన అర్థవంతమైన భావంతో లయబద్ధంగా ముందుకు సాగింది. ఇంకా ఈ కవితా విశ్వంభరుడు సంకలనంలో కవులు తాడెం లింగయ్య, పరాంకుశం సింహాద్రి, కళ్యాణ శ్రీ,, రాత్లావత్ కృష్ణ, గోగులపాటి కృష్ణమోహన్, మంచన మల్లేశం, ఎల్లటి తిరుపతి రెడ్డి, ప్రభాశాస్త్రి జోష్యుల, డాక్టర్ నాగులపల్లి శ్రీనివాస్, కట్టా రంజిత్ కుమార్, దుప్పటి మొగిలి,బత్తిన కృష్ణ, బండిరాజుల శంకర్, వాణిశ్రీ నైనాల, అద్దేపల్లి జ్యోతి, దండమూడి శ్రీ చరణ్, ముప్పిడి రాజు, వనపర్తి పద్మావతి, కందుల శివకృష్ణ మాదా స్వర్ణలత, పగడపాల కట్టా తిరుమల నారాయణ రెడ్డి గురించి తమదైన శైలిలో కవిత్వాన్ని సృజించారు.

ఈ కవితా సంకలనంలో నారాయణరెడ్డి జీవితం, వ్యక్తిత్వం, సాహిత్యం, తెలుగువారి హృదయాలలో చిర కాలం గుర్తుండిపోయే ఆయన సినీ గీతాల పరిమళం గురించి ఎందరో కవులు, కవయిత్రులు విభిన్న కోణాల్లో తమ కవితల్లో అభివర్ణించారు. ‘ఎగిరే రెక్కలో బతుకుని వర్ణించిన చైతన్య శీలియైన తెలంగాణ తేజో రూపం.. తెలుగై వెలిగిన సూర్యుడు.. అక్షరమై ప్రకాశించిన కవీంద్రుడు’ అంటూ ఈ సంకలనం సంపాదకులు డాక్టర్ శ్రీనివాస్ సినారెను కొనియాడారు . గొప్ప సాహిత్య విలువలతో నిరంతర కవిగా తన తుదిశ్వాస వరకు తెలుగు కవితా ప్రపంచంలో వెలుగొందిన అగ్రగణ్యులు డాక్టర్ నారాయణ రెడ్డి. తెలుగు సాహిత్య యవనికపై శిఖరప్రాయుడైన ఆయన సాహిత్య వైశిష్ట్యాన్ని చాటుతూ వచ్చిన కవితల కూడికే ఈ ‘కవితా విశ్వంభరుడు’.

*( ‘కవితా విశ్వంభరుడు’ - కవితల సంకలనం), సంపాదకులు: డా. తిరునగరి శ్రీనివాస్, వెల రూ. 100, ప్రచురణ: చేయూత పబ్లికేషన్స్, ప్రతులకు: అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలు, ఫోన్: 9441464764 )*



-డా॥ గన్నవరం వెంకటేశ్వర్లు
9550384498



“సినారె కవిత్వంలో ప్రయోగాలు- ప్రతీకలు’ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం రాసి ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నుండి డాక్టరేట్ పట్టా అందుకున్న కవి విమర్శకులు, రచయిత తిరునగరి శ్రీనివాస్ తానే సంపాదకులుగా ‘కవితా విశ్వంభరుడు’ అనే కవితా సంకలనాన్ని తీసుకొచ్చారు. ఈ సంకలనంలో 71 మంది కవులు, కవయిత్రులు సినారె సాహిత్యాన్ని విశ్లేషిస్తూ రాసిన కవితలు ఉన్నాయి.



ఫేస్ బుక్ “అమరావతి సాహితీ మిత్రులు” గ్రూపులో డా॥ రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. ఈ వారం వచన కవితల వర్క్ షాప్ లో 25 మంది కవులు పాల్గొన్నారు. విజేతలు ముగ్గురు ఉన్నారు. “వ్యవసాయం “ అనే అంశం మీద విజేతల కవితలు చదవండి.

-డా॥రావి రంగారావు
9247581825

-సంపాదకులు

## వ్యవసాయం

ఎప్పుడూ ఒక కల కంటాను
రైతు ఆత్మహత్యల
వార్తల కాలమ్ ఉండకూడదని...
అన్నం గిన్నె ముందు కూర్చుని
రైతు శ్రమను
నా రెండు కళ్ళకద్దుకుని
మొదటి ముద్దను గిన్నె వారకు
పెట్టి..
కృతజ్ఞతతో తలచుకునే
అన్నాన్ని స్వీకరిస్తాను..
తెల్లవారుజామున నాగలి
భుజానికెత్తుకొని
కాలాన్ని తోలుకెళుతుంటే
భూమి ఆ కాళ్ళను ముద్దాడుతుంది..
అతను నిత్యం
శిలువ మోస్తున్నట్టు తలపాగతో
గోడమీద క్రీస్తు పటమై
కనపడుతుంటాడు,
తన భుజాల
మీద వ్యవసాయాన్ని బతికిస్తూ
మనకు నూకలు చెల్లిపోకుండా
కాపాడుతున్నాడు...
ఏ విశ్వవిద్యాలయాలు చదవక పోయినా
ఏ నేలల్లో ఏ పంట వేయాలో
తెలిసిన శాస్త్రజ్ఞుడు,
చీడ పీడను తరిమి కొట్టే
ధన్వంతరి,
ఎన్నో పంటలు పండించి
దేశాని కింత కూడు పెట్టే చేతులు
పొలంలో కాడిని జంట ఎద్దులా
ఎత్తుకుని దున్నుతుంటే
నేలమ్మ తనువు పులకించి
ధాన్యపు రాశిలా నిలబడి
నమస్కరిస్తుంది...
నువ్వెంత సాంకేతిక టెక్నాలజీ
ఇసుకలో తల పెట్టిన నిప్పుకోడివైనా
రైతు వ్యవసాయం చేస్తేనే
రెండు ముద్దలు నోట్లోకెళ్ళేదని
రైతుని గౌరవించడం నేర్చుకో...

-నేలపూరి.రత్నాజీ
8919998753

## యజ్ఞం

ప్రకృతితో సహవాసం
ప్రాచీన జీవన విధానం
బలరామకృష్ణులు సైతం
ఆచరించిన పుణ్య కార్యం,
పంచభూతాల సాహచర్యం
పరిఢవిల్లిన ఫలసాయం
హలాయుధ సైన్యం
బసవన్నల బాహు బలత్వం
మృత్తికా మధనం
గగనతల కారు మేఘం
జలజల రాలిన నీలి పూల వర్షం
తొలకరి పలకరింత పరవశం
భూఫలకంపై బీజ అక్షరాభ్యాసం
తలలెత్తిన నూతన అంకురం
చిరుగాలి జలదరింతల తరుణీయం
పంట చూలాలు ప్రసవించిన ఫలసాయం
మానవ జఠరాగ్ని చల్లబరిచే
మధుర ఘృత ఔషధం
పంచభూతాలు సమిధలుగా
కర్షక దేవుళ్ళ యజ్ఞం..

-రాయసం గిరిజా రాణి
98499 17675

## రైతు కలలు



సూర్యుడు ఉదయించేలోపే
రైతు కలలు మేల్కొంటాయి.
చేతిలోని మట్టితో అతడు సంభాషిస్తాడు.
విత్తనం అతనికి గింజ కాదు,
రేపటి తరాల ఆకలి తీర్చే అక్షయ పాత్ర.
నాగలి గీతల్లో నాగరికత
తన చరిత్రను మళ్లీ మళ్లీ రాస్తుంది.
ఎండలు అతని శరీరాన్ని కాల్చినా,
రైతు ఆశను కాల్చలేవు.
మేఘాలు కనిపిస్తే రైతు కళ్లలో
దీపాలు వెలుగుతాయి.
మొదటి చినుకు నేలను తాకగానే
భూమి నవ్వుతుంది.
ఆ నవ్వుకు అర్థం చెప్పగలిగేది
రైతు గుండె మాత్రమే.
పచ్చని మొలక
భూమి పెదవులపై పుట్టిన చిరునవ్వు.
పొలం ఎకరాల లెక్క కాదు,
ఎన్నో తరాల జీవన చరిత్ర.
చెమట చుక్కలతో రాసిన కవిత్వమే
గాలికి ఊగే వరి కంకులు పాడే జాతీయ గీతం.
అన్నం వడ్డించే ప్రతి అమ్మ వెనుక
రైతు నిశ్శబ్ద త్యాగం నిలబడి ఉంటుంది.
ప్రతి గింజలో అతని శ్రమ,
ప్రతి ముద్దలో అతని ప్రేమ దాగి ఉంటాయి...
వ్యవసాయం లేకపోతే
సంపదకూ అర్థం ఉండదు.
ఆకలి ముందు చక్రవర్తి తలవంచినట్లే,
రైతు ముందు సమాజం తలవంచాలి.
భూమిని తల్లిగా చూసే
మనిషి మాత్రమే
రైతు విలువను అర్థం చేసుకుంటాడు.
ప్రకృతితో యుద్ధం చేయకుండా,
ప్రకృతితో జీవించడం నేర్పిన రైతు.
వ్యవసాయం వృత్తి కాదు,
జీవుల మనుగడకు మూలాధారం.
రైతు నవ్వితే గ్రామం నవ్వుతుంది.
గ్రామం నవ్వితే దేశం నవ్వుతుంది.
దేశం నవ్వితే ప్రపంచమే
ప్రశాంతంగా ఉంటుంది.
అందుకే మట్టిని ప్రేమించడం అంటే మనల్ని
మనం ప్రేమించుకోవడం.
రైతును గౌరవించడం అంటే
పరమాత్మను గౌరవించడం.
ఒక్క మెతుకును కూడా వృథా చేయొద్దని
ప్రతి గింజ మనతో మాట్లాడుతోంది.
వ్యవసాయం స్తంభిస్తే
నాగరికత నిలిచి పోతుంది
మట్టిని ఆరాధించే చేతులు ఉన్నంతకాలం
భూమిపై ఆకలి కనిపించదు.

-వక్కలగడ్డ వెంకటేశ్వరరావు
9849559581

## సామాజిక చైతన్యంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి



సభలో పాల్గొన్న అతిథులు

హైదరాబాద్, జులై 22:సామాజిక చైతన్యం కలిగించటంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని ఆంధ్ర మహిళాసభ ఆర్ట్స్ & సైన్స్ కాలేజి ప్రిన్సిపాల్ డా॥కరుణాదేవి అన్నారు. సాహితీకిరణం, కొసరాజు ఆర్తి & జాహ్నవి మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆంధ్ర మహిళాసభ లాంగ్వేజ్ లిటరరీ క్లబ్ సంయుక్తంగా ‘పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల బాధ్యత’ అనే అంశంపై విద్యార్థినులకు నిర్వహించిన వక్తృత్వ పోటీ అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న కరుణాదేవి మాట్లాడుతూ వక్తృత్వపోటీలు భాష స్పష్టతకు, సభాభయం పోయేందుకు దోహదం చేస్తుందని, ప్రతినెలా ఇలాంటి పోటీలు నిర్వహించాలని సూచన చేశారు. తెలుగుశాఖ ప్రధాన ఉపాధ్యాయురాలు ఎ.అలివేణి అధ్యక్షత వహించిన ఈ సభలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కొసరాజు సామ్రాజ్యం ప్రసంగిస్తూ తాను గత మూడు సంవత్సరాలుగా కవిసమ్మేళనం నిర్వహించడం, కవితాసంకలనాలు ప్రచురిస్తూ ఉండడం జరుగుతుండేది అంటూ ఈ సారి ఇటువంటి కార్యక్రమం నిర్వహించడంపై తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు ప్రసంగిస్తూ విద్యార్థినులలో ప్రతిభ, ప్రజ్ఞ పెంపొందించబడి వారు ఉన్నత స్థానాలకి ఎదగాలంటే ఇటువంటి కార్యక్రమాలు వారిలో ఉత్సాహాన్ని పెంచుతాయని సలహా ఇచ్చారు. సాహితీకిరణం మేనేజర్ పొత్తూరి జయలక్ష్మి తాను ఒకప్పుడు ఈ మహిళాసభ పాఠశాల విద్యార్థినని చెబుతూ గతాన్ని నెమరువేసుకున్నారు. సాహితీకిరణం సలహాదారులు పెద్దూరి వెంకటదాసు విద్యార్థినులు కవిత్వంలో కూడా ప్రావీణ్యతను సంపాదించాలని ఉద్బోధించారు. ఆంధ్ర మహిళాసభ వ్యవస్థాకులైన దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి సందర్భంగా వక్తలు వారికి ఘనంగా నివాళులర్పించారు. సభలో ఆంగ్ల భాష హెచ్.ఒ.డి. పి. రాజ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ వసుంధరాదేవి పాల్గొని ప్రసంగించారు. పోటీలో ప్రథమ, రెండు ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా అమృతవల్లి, మల్లిక, ప్రణతిలకు బహూకరించారు.

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ



### ఆగిపోయిన స్వరఝరి

ఒక గానకోకిల
స్వరం మూగబోయింది
స్వరఝరీ ప్రవాహం ఆగిపోయింది
మధురాతి మధుర గాన లహరి
దూర తీరాలకు సాగిపోయింది.
ఏ దివిలో విరిసిన పారిజాతమో
భువికి వచ్చి తన గాన పరిమళాలతో
అశేష జనాన్ని
ఉర్రూతలూగించి
నీ లీల పాడెద దేవా అంటూ
ఆ దేవ దేవ సన్నిధికి చేరిపోయింది
తరలిరాని లోకానికి
మరలిపోయింది.
సిరిమల్లెపువ్వా అంటూ
గాన ప్రియుల మదిని
ఊయలలూపించింది
ఆ మధుర గళముతో
పసిపాప గారాలతోనూ
మురిపించింది.
పండుముదుసలి రాగాలతోను
అలరించింది.
ఎన్నో వేల పాటలతో
తన అద్భుతమైన గాత్రంతో
గాన ప్రియుల మనసులను
మంత్రముగ్ధులను చేసి,
పగలే వెన్నెలలు కురిపించి
జనుల హృదయాలలో
చీకటిని నింపి వెళ్లిపోయింది
సినీ వినీలాకాశంలో
ధృవతారయై నిలిచిపోయింది.
ఆ గళం మధురం
ఆ గానం అమరం
ఆ సుస్వర గానకోకిలకు
ఇదే నా కన్నీటి నీరాజనం.

-కొలచన విజయ భారతి
హైదరాబాద్

### అజరామర గాన గాంధర్వం



స్వరలహరుల సుమధుర రాగాల జానకమ్మ
మధుర మకరందాలొలుకు గాన కోకిలమ్మ
సుమధుర సంగీత సరిగమల ధునివమ్మా
సుస్వర నాదాలకు నీ గళసీమ పట్టుగొమ్మ
నవరసాలు అలఓకగా పలికించే గాత్రమమ్మ.
నీ మధుర గానామృతంతో వీనులకు విందొనరించి
ధ్వన్యనుకరుణ రాగాలాపనతో శ్రోతలను అలరించి
సుధలొలుకు స్వరరాగ గమకాలతో మైమరపించి
యాభైవేల గీతాలతో ప్రేక్షక హృదయాల్ని మెప్పించి
ఇలలో సంగీతలక్ష్మిగా కొలువైనావు ఖ్యాతి గడించి.
కట్టుకథలు చెప్పి నేను కవ్విస్తే పాటలో పండుముసలి స్వరంతో
గోవుల్లు తెల్లన గోపయ్య నల్లన పాటలో చిన్నపిల్లడి గళంతో
అలక పానుపు ఎక్కనేల చిలిపి గోరింకా పాటలో బామ్మ గొంతుతో
చిన్నారి పొన్నారి కిట్టయ్య పాటలో లోకమెరుగని పసిపాపడి కంఠంతో
వైవిధ్య గళాల గానామృతంతో యావత్భారతాన్ని పరవశింపచేశావు,
అత్యద్భుత స్వర సంపద గాయనిగా పది నంది బహుమతులనంది
వివిధ రాష్ట్రాల పలుభాషలలో నేపథ్య గాయనిగా మన్ననలంది
అపూర్వ గానశైలితో అమూల్య కళైమామణి బిరుదును సైతం పొంది
భారతీయ సుస్వర సంగీత సామ్రాజ్ఞిగా అందరి హృదిలో కొలువైంది,
మమ్మల్ని దుఃఖ సాగరంలో ముంచి దివికేగిన గాన గాంధార్వమా
అమరేంద్రుని కొలువును అలరించుటకై తరలిన స్వరఝురుల గానామృతమా
ఆ చంద్రతారార్కం అమరత్వంతో నేపథ్య గాయనివై వెలిగే జానకమ్మ
కడసారి అశ్రునయనాల మా కన్నీటి నివాళులు అందుకో గాన కోకిలమ్మ.

-ఎస్. రత్నలక్ష్మి

### "గళ మాధుర్యం"



కోటి రాగాల కోకిలమ్మా అమ్మా,జానకమ్మా,
మౌనమైన మధుర గాన జ్యోతి
తరాలు మారినా తరగని స్వర సౌరభములా
గమకాల గలగలలతో గళ మాధుర్యం గుబాళించేలా
షడ్జమమై శుభ మంగళ రాగం మేల్కొలిపేలా
ఋషభమై రసరంజిత మెరుగులు నింపేలా
గాంధారమై గుండెగదిని గిలిగింతలు పెట్టేలా
మధ్యమమై మమతానుభావాలతో మురిపించేలా
పంచమమై పరవశ ప్రేమ పరిమళించేలా
దైవతమై దివ్య సుధాజల్లులు కురిపించేలా
నిషాదమై నిశ్శబ్ద నాదరూపమై నిలిచేలా
గమకతంత్రులతో సంగీత ఆలాపనల అలలలా
జన హృదయాలలో జలపాతమై ప్రవహిస్తూ కమ్మని కంఠం
గాంధర్వ గానామృతంతో అలరిస్తూ అలసిపోయితిరా
భువిపై మౌనగీతమై మిగిలిపోయితిరా
భావాల వీణపై నిత్యనాదమై నిలిచిపోయేటి
సప్తరాగ సప్తపదిలా
గానకోకిల మూగబోయినా గానం మారుమ్రోగేలా
కొలువుంటారు కోటి హృదయాలలో చిరస్మృతిలా
దివిలో మధురగానమై నిలిచిపోయేలా
యుగయుగాలు వెలిగెదరు నిత్య నక్షత్రంలా

-సింగీతం విజయలక్ష్మి,
చెన్నై

### మూగబోయిన గాన కోకిల

మాటలోని మాధుర్యాన్ని
పాటలో నింపిన గానకోకిల
వీనులవిందుచేసి రసహృదయాలలో
సంగీత రుచులను తెలిపినది.
తెలుగు భాష తియ్యదనం
పాటల్లో నింపిన సంగీత మాధుర్యం
హృదయ కోటలో జానకమ్మదేవతై వెలసింది
చిత్రసీమరంగంలో సంగీత రాణిగ
కీర్తి శిఖరాలు చేరుకున్నారు.
భక్తి రసాలను పాటల్లోనింపి
భక్తుల హృదయాల్లో భగవంతుని
నామస్మరణను ప్రతిధ్వనింపచేసి
భారతీయ సంస్కృతి,సంప్రదాయాలకు
జీవంపోసినది
వసంతంలో రాగాలుపలికే కోకిలకే
రాగాలు నేర్పే జానకమ్మ
ప్రకృతి రమణీయతను
మనిషి మనోరంజనానికి మరలించి
తన్మయత్వానికే కవచమై నిలిచింది
కాలం పెట్టిన సరిహద్దుతో
పాటల కోకిల మూగబోయింది.

-డా.బి.సుధాకర్

### "మా నాన్నగారు (వ్యాసాంజలి)" గ్రంథం నిర్వహించిన వ్యాస రచన పోటీల ఫలితాలు

మడత చంద్రమౌళి సాహితి సృజనాలయం, వరంగల్ వారు "మా నాన్నగారు (వ్యాసాంజలి)" గ్రంథం కోసం నిర్వహించిన జాతీయస్థాయి వ్యాసరచన పోటీలలో ఫలితాలు వెల్లడి చేసినట్లు కవి, రచయిత, సంపాదకులు డా. మడత భాస్కర్ తెలియజేశారు. ఈనెల 29 వ తేదీ, గురు పౌర్ణమి సందర్భంగా జూమ్ , అంతర్జాలం వేదికగా జరగనున్న పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఈ బహుమతులు అందజే యబడతాయని వారు పేర్కొన్నారు.

**ప్రథమ బహుమతి:** డా.కె.జి.వేణు , విశాఖపట్నం-5116
**ద్వితీయ బహుమతి :** డా॥సందుపట్ల మధు, హన్మకొండ -3116
**తృతీయ బహుమతి:** శ్రీ మౌనశ్రీ మల్లిక్, హైదరాబాద్ -2116
**ప్రత్యేక బహుమతులు:** డా.సి.వి. సర్వేశ్వర శర్మ , అమలాపురం-1116
శ్రీ పొత్తూరి సీతారామరాజు, కాకినాడ -1116
**ప్రోత్సాహక బహుమతులు:** శ్రీమతి ఆకుతోట జ్యోతి, మహబూబాబాద్-516
శ్రీ శీలం భద్రయ్య, నల్గొండ-516, శ్రీ సిహెచ్. నాగార్జున శర్మ, తిరుపతి -516, శ్రీమతి అడవి అన్నపూర్ణ, అమెరికా-516, శ్రీ కేశరాజు వెంకట ప్రభాకరరావు, ఖమ్మం -516

పుస్తక సమీక్ష

# మానవీయ విలువల పరిమళం... "ఆలోచనా పరిమళాలు"






ప్రతులకు:
పలుగుల సతీశ్‌కుమార్
సెల్:9912161970

కవిత్వం అనేది కేవలం భావోద్వేగాల వ్యక్తీకరణ మాత్ర మే కాదు. అది కాలంతో సంభాషించే చైతన్యం, సమాజాన్ని ప్రశ్నించే నైతిక ధైర్యం, మానవీయ విలువలను పరి రక్షించే సాహిత్య బాధ్యత. ఒక కవి తన కాలాన్ని ఎంత లోతుగా పరిశీలిస్తాడో, అతని కవిత్వం అంతగా సమాజానికి అద్దంలా నిలుస్తుంది. ఈ కోణంలో పరిశీలిస్తే, సతీష్ కుమార్ రచించిన **"ఆలోచనా పరిమళాలు"** కవితా సంపుటి కేవలం కవితల సంకలనం మాత్రమే కాదు; మానవీయ విలువలు, సామాజిక బాధ్యత, విశ్వశాంతి, దేశభక్తి, గాంధేయ తత్వం, పర్యావరణ స్పృహ, ఆధ్యాత్మిక చింతన, యువత పట్ల ఆశాభావం వంటి విభిన్న జీవన పార్శ్వాలను ఒకే దారంలో అల్లిన భావయాత్ర.

ఈ సంపుటిలోని 85 కవితలు విడివిడిగా రాసిన రచనలుగా కనిపించినప్పటికీ, వాటిని చదువుతుంటే ఒక సమగ్ర భావప్రవాహం పాఠకుడిని ఆవరిస్తుంది. విశ్వమానవీయ చైతన్యంతో ప్రారంభమై దేశభక్తి, మతసామరస్యం, ఆధ్యాత్మికత, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత, సాహిత్య స్పృహ, యువశక్తి వరకు విస్తరించిన ఈ కవితా ప్రయాణం కవి ఆలోచనా విశాలతకు నిదర్శనం. అందుకే ఈ సంపుటి పేరు "ఆలోచనా పరిమళాలు" కేవలం శీర్షికగా కాకుండా, సంపుటి స్వరూపాన్ని ప్రతిబింబించే సార్థక నామధేయంగా నిలుస్తుంది.

సంపుటి ప్రారంభంలోనే **"ఓ శాంతి కపోతమా!"** అంటూ కవి చేసే సంబోధన ప్రపంచ మానవాళిని ఉద్దేశించిన శాంతి సందేశంలా అనిపిస్తుంది. యుద్ధాలు, హింస, విద్వేషాలతో అల్లకల్లోలమవుతున్న ప్రపంచంలో ప్రేమ, కరుణ, సహనం, సహజీవనమే శాశ్వత పరిష్కారమనే విశ్వాసాన్ని కవి ఆవిష్కరిస్తారు. అదే భావప్రవాహం "కవితా ఓ కవితా!" వంటి కవితల్లో మరింత విస్తరించి, కవిత్వాన్ని సమాజాన్ని మేల్కొలిపే చైతన్యశక్తిగా ప్రతిపాదిస్తుంది.

ఈ సంపుటిలో ప్రత్యేకంగా నిలిచే కవితల్లో **"అణ్వస్త్రాలు"** ఒకటి. ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రజలు ఇంకా అన్నం, వస్త్రం, నివాసం వంటి మౌలిక అవసరాల కోసం పోరాడుతుండగా, మరికొన్ని దేశాలు తమ ఆధిపత్యాన్ని చాటుకోవడానికి అణ్వస్త్రాల నవీకరణలో పోటీపడటం కవిని తీవ్రంగా ఆలోచింపజేసినట్లు ఈ కవిత తెలియజేస్తుంది. నాగరికత పేరుతో మానవ వినాశనాన్ని ఆహ్వానించే ప్రపంచ రాజకీయాలపై కవి వ్యక్తం చేసిన ఆవేదన ప్రతి మానవతావాది హృదయాన్ని తాకుతుంది. మానవ అవసరాల కంటే మారణాయుధాలకు ప్రాధాన్యం పెరుగుతున్న ఈ కాలాన్ని ప్రశ్నిస్తూ, శాంతియుత సహజీవనమే మానవాళి భవిష్యత్తుకు మార్గమని కవి విశ్వసించడం ఈ కవితలోని ప్రధాన అంతరార్థం.

''గాంధీ మార్గం'', ''గాంధేయవాదం'', **"గాంధీగిరి"** వంటి కవితల్లో గాంధీజీని చరిత్రలో నిలిచిపోయిన మహనీయుడిగా కాకుండా, నేటి సమాజానికి అత్యంత అవసరమైన జీవన తత్వంగా కవి ఆవిష్కరించారు. పెరుగుతున్న విద్వేషం, హింస, అసహనం, ప్రతీకార ధోరణులకు ప్రత్యామ్నాయంగా గాంధేయ మార్గాన్నే ఆయన సూచిస్తారు. "దేశ సమైక్యతకు - ప్రపంచ శాంతికి ఆశాదీపం" అంటూ గాంధేయవాదాన్ని నిర్వచించిన తీరు, అహింసను వ్యక్తిగత సద్గుణంగా కాకుండా సామాజిక జీవన విధానంగా ప్రతిపాదించడం కవి విశాల దృక్పథానికి నిదర్శనం. ద్వేషానికి బదులు ప్రేమ, హింసకు బదులు అహింస, ప్రతీకారానికి బదులు క్షమాగుణం వంటి గాంధేయ విలువలు నేటి ప్రపంచానికి ఎంత అవసరమో ఈ కవితలు హృద్యంగా గుర్తుచేస్తాయి.

దేశభక్తి - ఈ సంపుటిలో కేవలం భావోద్వేగ నినాదంగా వ్యక్తం కాలేదు. **"జయహో స్వతంత్ర భారతీ", "భారతమాత ప్రియపుత్రుడా", "దేశభక్తి చైతన్యం", "రాజకీయం", "ఓట్ల పండుగ"** వంటి కవితల్లో దేశప్రేమను ప్రజాస్వామ్య బాధ్యతతో ముడిపెట్టారు. దేశాన్ని ప్రేమించడం అంటే కేవలం జాతీయ పతాకానికి వందనం చేయడం మాత్రమే కాదని, రాజ్యాంగ విలువలను గౌరవించడం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, బాధ్యతగల పౌరులుగా వ్యవహరించడం కూడా అంతే ముఖ్యమని కవి తన కవిత్వం ద్వారా గుర్తుచేస్తారు. ముఖ్యంగా **''ఓట్ల పండుగ''** కవితలో ఓటు హక్కును ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువుగా చిత్రించిన తీరు ప్రతి పౌరుడిని ఆలోచింపజేస్తుంది.

సామాజిక చైతన్యానికి సంబంధించిన కవితల్లో కవి మరింత పదునైన పరిశీలకుడిగా కనిపిస్తారు. **"ఉన్మాదం", "మన ధర్మం", "మనసే మంచిదైతే", "విమోచనం... విమోచనం", "ఓ మనిషీ తెలుసుకో"** వంటి కవితల్లో కుల, మత, ప్రాంత, వర్గ విభేదాల మధ్య చిక్కుకున్న సమాజాన్ని మానవీయ దృక్పథంతో పరిశీలిస్తారు. మనిషిని మనిషిగా చూడాలనే విశ్వమానవీయ దృష్టి ఈ కవితలన్నింటినీ ఒకే దారంలో కట్టిపడేస్తుంది. "వసుధైవ కుటుంబం" అనే భారతీయ తాత్విక భావనను గుర్తు చేస్తూ, ప్రపంచమంతా ఒక కుటుంబమనే సందేశాన్ని కవి హృద్యంగా ఆవిష్కరించారు.

ఈ సంపుటిలో మరో విశేషం పర్యావరణ చైతన్యం. ప్రకృతిని కేవలం సౌందర్యానికి ప్రతీకగా కాకుండా, మానవ జీవనానికి ఆధారంగా కవి చిత్రించారు. **"పర్యావరణ చైతన్యం", "పచ్చదనం", "రైతు"** వంటి కవితల్లో ప్రకృతిని సంరక్షించడం అంటే భవిష్యత్తు తరాలను కాపాడడమేననే సందేశం ప్రతిధ్వనిస్తుంది. ప్రకృతి-మనిషి అనుబంధాన్ని ఎంతో సరళంగా, కానీ హృదయాన్ని తాకేలా వ్యక్తీకరించడం కవి సున్నితమైన భావ ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి గా రచయితకు ఉన్న అనుభవం యువశక్తి చైతన్యంకు సంబంధించిన కవితల్లో స్పష్టంగా ప్రతిఫలిస్తుంది. **"నేటి పిల్లలు - రేపటి జాతి దీపాలు", "పరీక్ష సమ యం", "యువత"** వంటి కవితల్లో యువతకు కేవలం బోధ చేయాలనే ఉద్దేశం కనిపించదు. వారిలో ఆత్మ విశ్వాసాన్ని, విలువలను, సేవా భావాన్ని పెంపొం దించాలనే ఒక గురువు హృదయం కనిపిస్తుంది. అందుకే ఈ కవితలు ఉపదేశాలుగా కాకుండా, ఆత్మీయ సూచనలుగా అనిపిస్తాయి.

ఈ సంపుటిలోని కవితలన్నింటినీ ఒకే దృష్టితో పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. కవి సమస్యలను మాత్రమే చూపించి ఆగిపోలేదు; వాటికి మానవీయ విలువల ఆధారంగా పరిష్కార మార్గాలను కూడా సూచించారు. శాంతి, ప్రేమ, సహనం, సేవ, బాధ్యత, ప్రకృతి పరిరక్షణ, దేశభక్తి, సామాజిక సమానత్వం- ఇవన్నీ ఆయన కవిత్వంలో సందేశాలుగా కాకుండా జీవన విలువలుగా ఆవిష్కృతమయ్యాయి.

సతీష్ కుమార్ కవిత్వంలోని మరో ప్రధాన ఆకర్షణ సరళమైన భాష. భావాన్ని క్లిష్టమైన ప్రతీకల వెనుక దాచకుండా, ప్రతి పాఠకుడికీ అర్థమయ్యేలా వ్యక్తీకరించడం ఆయన ప్రత్యేకత. ఈ సంపుటిని చదివినప్పుడు ఎక్కడా పదాల ఆర్భాటం కనిపించదు; భావాల సహజత్వమే మనసును తాకుతుంది. అందుకే ఈ కవితలు సాహిత్యాభిమానిని మాత్రమే కాదు, సాధారణ పాఠకుడినీ ఆలోచింపజేస్తాయి.

ఇక్కడ ఒక విషయం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. సతీష్ కుమార్ కవిత్వం ప్రశ్నలను లేవనెత్తుతుంది, సమాధానాలను బలవంతంగా రుద్దదు. ఆలోచించే అవకాశాన్ని పాఠకుడికే వదిలేయడం ఈ సంపుటి సాహిత్య పరిపక్వతకు నిదర్శనం. ప్రతి కవిత ముగిసిన తర్వాత పాఠకుడి మనసులో మరో ఆలోచన మొదలవుతుంది. అదే ఈ సంపుటి విజయంగా భావించాలి.

ఈ సంపుటి చదువుతున్నంతసేపూ నాకు ఒక భావన పదేపదే కలిగింది. ఇవి కేవలం కవితలు మాత్రమే కావు; ఒక ఉపాధ్యాయుని జీవితానుభవాలు, బాధ్యతగల పౌరుడి సామాజిక చైతన్యం, సాహిత్యాభిమాని హృదయస్పందన, మానవతావాది అంతర్మథనం అక్షరరూపం దాల్చిన భావవ్యక్తీకరణలు. అందుకే ఈ కవితల్లో ఉపదేశ ధోరణి కంటే ఆత్మీయత ఎక్కువగా కనిపిస్తుంది; నినాదాల కంటే మానవీయ విలువలే ఎక్కువగా ప్రతిధ్వనిస్తాయి. ప్రతి కవిత పాఠకుడిని ఆలోచింపజేస్తుంది, ఆత్మపరిశీలనకు ఆహ్వానిస్తుంది. ఇదే "ఆలోచనా పరిమళాలు" సంపుటి ప్రత్యేకత.

ఈ సంపుటికి "ఆలోచనా పరిమళాలు" అనే శీర్షికను అత్యంత ఆలోచనాత్మకంగా ఎంపిక చేసినట్లు అనిపిస్తుంది. ఎందుకంటే ప్రతి కవిత ఒక ఆలోచనను ఆవిష్కరిస్తుంది. ప్రతి ఆలోచన ఒక విలువను ప్రతిపాదిస్తుంది. ప్రతి విలువ ఒక మానవీయ పరిమళంలా పాఠకుడి హృదయంలో నిలిచిపోతుంది. ఈ కోణంలో చూస్తే, ఈ శీర్షిక సంపుటి స్వరూపాన్ని సంపూర్ణంగా ప్రతిబింబిస్తుంది.

వ్యక్తిగతంగా శ్రీ సతీష్ కుమార్ నా హైస్కూల్ రోజుల నాటి ఆత్మీయ మిత్రుడు. ఆయన సౌమ్యత్వం, వినయశీలత, ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా సమాజం పట్ల ఉన్న నిబద్ధత నాకు ఎన్నో సంవత్సరాలుగా తెలుసు. అయితే ఆయన కలం నుంచి ఇంతటి భావగర్భితమైన కవితా సంపుటి వెలువడుతుందని మాత్రం నేను ఊహించలేదు. "ఆలోచనా పరిమళాలు" చదివిన తర్వాత ఒక మిత్రుడిగా కలిగిన ఆనందం కంటే, ఒక పాఠకుడిగా పొందిన సంతృప్తి ఎక్కువగా అనిపించింది. ఈ సంపుటిలోని కవితలు స్నేహానికి అతీతంగా తమ సాహిత్య విలువలతో పాఠకుల హృదయాలను చేరుకునే శక్తిని కలిగి ఉన్నాయని నా విశ్వాసం.

సతీష్ కుమార్ కవిత్వంలో వ్యక్తిగత భావోద్వేగం కంటే సామాజిక బాధ్యత ఎక్కువగా కనిపిస్తుంది. సమాజాన్ని నిందించడం కాదు, సమాజాన్ని మేల్కొలపాలనే తపన ఈ కవితల్లో అంతర్లీనంగా ప్రవహిస్తుంది.

ఇదే ఈ సంపుటిని సాధారణ కవితా సంకలనాల నుంచి ప్రత్యేకంగా నిలబెడుతుంది. ఒక ఉపాధ్యాయుడి అనుభవం, ఒక సాహిత్యాభిమాని స్పందన, ఒక బాధ్యతగల పౌరుడి ఆలోచన, ఒక మానవతావాది ఆకాంక్ష...ఈ నాలుగు ప్రవాహాలు సంగమించిన చోట "ఆలోచనా పరిమళాలు" పుట్టింది అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

తెలుగు కవిత్వంలో సందేశాత్మక కవిత్వానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది.

ఆ సంప్రదాయాన్ని ఆధునిక సామాజిక సందర్భాలతో అనుసంధానిస్తూ, సమకాలీన సమస్యలపై స్పందిస్తూ, మానవీయ విలువలను కేంద్రబిందువుగా చేసుకొని రచించిన ఈ సంపుటి నేటి పాఠకులకు ఆలోచ నలను మాత్రమే కాదు, ఆత్మపరిశీలనను కూడా అంది స్తుంది. అందువల్ల "ఆలోచనా పరిమళాలు" ఒకసారి చదివి పక్కన పెట్టే పుస్తకం కాదు; సందర్భానుసారంగా మళ్లీ మళ్లీ చదవాలనిపించే కవితా సంపుటి.

ఈ తొలి అడుగుతోనే సతీష్ కుమార్ తన సాహిత్య సామర్థ్యాన్ని చాటుకున్నారు.

ఈ ప్రయాణం ఇక్కడితో ఆగిపోకుండా, తెలుగు సాహిత్యానికి మరిన్ని విలువైన కవితా సంపుటులను ఆయన అందించాలని హృదయ పూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను.



-గోగులపాటి కృష్ణమోహన్
9700007653

### అసహజం

మారాకు చిగురాకు పురుడు పోసినట్టు
పసరాకు ముందు పండాకు రాలినట్టు
మొగ్గ పువ్వై పిందెకు జన్మనిచ్చినట్టు
పిందె పండై పదుగురికి ఫలమైనట్టు
కాలుష్యం ఎంత కోరలు చాచిన
ప్రకృతిలో అనాది నుంచి
అతి సహజంగా జరుగుతున్న ప్రక్రియ కదా.
మరి మనుషులేంది
కుంటువట్టి ఇంతలా కుశించుకపోతుండ్రు
మానవత్వం మరిచి మమతలనే కాదు
మనుషులను చంపుకుంటుండ్రు
మనసు సచ్చి వాళ్ళు సస్తుండ్రు.
చెపలచిత్తులై చింపుల శాతలు చేస్తూ
చికాకులలో చిరాకు పడుతుండ్రు
అబద్దాలతో అభద్ర జీవితం
గడుపుతూ
గతితప్పి అగమ్య సంచారలైతుండ్రు.
మనుషులు సహజత్వం కోల్పోయి
చానా రోజులైనట్టు ఉన్నది
అతి సున్నిత సందర్భాలలో కూడా
అసలు స్పందించడమే లేదు
ఉన్నట్టా......! లేనట్టా..!
మరి ఉండి లేనట్టా..?



-డా॥ఎడ్ల కల్లేశ్
9866765126

### తల పొగరు

పర్వతారోహణలో తల వంచి..
అధిరోహించే సాహసికుడు
పర్వత శిఖరం దిగేందుకు?.
తల వెనక్కి వంచుతాడు
ఎదిగేందుకు మనుషులు..
తల దించుకొని లక్ష్యం చేరితే..
తల పొగురుతో ఫోజు కొట్టే వాళ్లు..
పతన పాతాళంలోకి దిగజారుతారు !.
ఇంట్లో ఆడ బిడ్డ లక్ష్మి అయితే?
అబ్బాయి దీపక్ అవుతాడు
ప్రేమ, కరుణల చిరునామా అమ్మాయి
బాధ్యత, సంఘర్షణ వలలో అబ్బాయి
ఇంటిని ఆనంద నిలయంగా మార్చి..
రేపటి ఆశల దీపాలకు చమురు అవుతారు!
నీ విలువను లెక్కించని వారిని..
నువ్వెప్పుడూ పట్టించుకోకు నేస్తం
వజ్రం విలువకు పరిచయం అక్కర్లేదు
మనం చేసే పనులే మన గుర్తింపు
సత్కర్మల గొడుగులే శ్రీరామ రక్ష
సదాలోచనలే ప్రశాంత జీవనాలు !



- మధుపాలీ
9949700037

### నాన్న లేని ఈ క్షణం

నిజమైన ఓదార్పు లేదు
కన్నీటికి చివరి హద్దు లేదు
చెప్పరాని రంధి
ఎంతకాలమయిన తీరని వెత
వెంబడిస్తుంది
కన్నీళ్లతో తడిపిన మాల
నీ మెడలో వేలాడుతుంటే
ఏ పువ్వును చిదిమినా
మనసు తడిసిపోతుంది
నా చిత్త భవనంలో,
గతం వెతికి తెచ్చిన నిలువెత్తు చిత్రాలలో,
నా భావి ప్రణాళికలలో
నీ బ్రతుకు వెలుగుల ముద్రలు ఎప్పుడూ
నిలిచి ఉంటాయి నాన్న.



-రజిత
సెల్:7569856191

### జీవన గీతం

నా మౌన గీతాన్ని పాడమని అడిగితే రాగాలు కసిరాయి..
కన్నీళ్ళు లోలోన దాచేసి నవ్వితే నయనాలు కసిరాయి..
మాటలే రావంది..మోడునే తానంది.. ఒంటరై మిగిలింది..
మనసు తన ద్వారాలు మూసేసి దాగితే బంధాలు కసిరాయి..

ఈ బ్రతుకు పయనమున నేను నడిచిన దారి ఓ కథను చెబుతుంది ..
నిన్నలో వేదనల గురుతులను తడిమితే గమ్యాలు కసిరాయి.

ఏది నా రూపమో.. ఇంకేది వేషమో మరిచాను కాబోలు..
అసలు నేనెవరంటు ఉనికికై వెతికితే అద్దాలు కసిరాయి..

అస్తిత్వ భావనే కరిగిపోతున్నాక దిగులెందుకే జ్యోత్స్న..
శూన్యాల సీమలను చేరుటకు బెదిరితే ప్రాణాలు కసిరాయి



-జ్యోత్స్న సుబ్బా
9491460490

## తల్లిదండ్రులకు దివ్యౌషధం ఈ పుస్తకం!




ప్రతులకు:
ఎమెస్కో బుక్స్
1-2-7, బానూకాలనీ
గగన్‌మహల్ రోడ్
దోమలగూడ
హైదరాబాద్-500 029.

డా॥ఆర్.బి.అంకం రచించిన "పిల్లల పెంపకంలో 21 అద్భుత సూత్రాలు" పుస్తకానికి భారతీయం సత్యవాణిగారు రాసిన ముందుమాట

తల్లిదండ్రులు అనే పాత్రను పోషించడంలో ప్రతీ ఒక్కరు సిద్ధహస్తులు కావాలి! ప్రేమికులు అనే స్థితి నుండి మిత్రులు అనే స్థితికి ఎదిగి రావాలి. ఆప్తమిత్రులయి కుటుంబాన్ని దివ్యంగా నడపగలగాలి. అంటే ఏమిటి? సృష్టి మీ కంతటి ప్రమోషన్ ఇస్తుందన్నమాట. కానీ ఈ ప్రమోషన్‌ను అందుకోవడమే కష్టం. చాలా మందిమి వెనుకటి స్థితిలోనే ఉండిపోవడానికి ఇష్టపడతాం.

ఈ సందర్భంగా కాళిదాసు అన్న ఒక మంచి మాటను గుర్తు చేసుకుందాం! "పిల్లలు పుట్టే వరకూ మీరు నవదంపతులు. పిల్లలు కలిగిన తరువాత ఆ కుటుంబమనే బండికి తల్లిదండ్రులు చక్రాల్లాంటి వారు. ఆ బండిలో కూర్చునే వారు పిల్లలు. అంటే-? వివాహమనే వినోద స్థితి నుండి బాధ్యతాయుతమైన కుటుంబ స్థితికి వస్తున్నారన్నమాట" ఎంత అర్థవంతమైన మాట ఇది!

అందుకే ఈ మధ్యకాలంలో ఆధునిక మానవుడికి జీవితం మీద పట్టు కుదరడం లేదు. అన్నిటికి ఘర్షణ పడుతున్నాడు. లేదంటూ నిరాశ, నిస్పృహకు లోనవుతున్నాడు. కారణం ఏమిటి అని పరిశీలిస్తే ఇటీవలి కాలం వరకు సామాజిక వ్యవస్థలో అవస్థలు తక్కువ. కారణం పిన్నలూ, పెద్దలూ కలిసి ఒక చోట ఉండగలగడం, ఇప్పుడు పిన్నలూ, పెద్దలూ చెరొక చోట, చెట్టుకొకరు, పుట్టకొకరు, పల్లెలో ఒకరు, పట్నంలో ఒకరు. పిన్నల సహకారం, పెద్దలకందడం లేదు, పెద్దల సారథ్యం పిల్లలకు అమరడం లేదు.

ఇటువంటి పరిస్థితిలో పట్టించుకునే వారి కోసం జాతి ఎదరు చూస్తోంది. పట్టి నడిపించేవారు దొరికితే వారి చేయి పట్టుకొని నడవడానికి జాతి సిద్ధపడుతుంది. అలా నడిపించడానికి వచ్చిందే ట్యూటర్స్ ప్రైడ్ (Tutors Pride). ట్యూటర్స్ ప్రైడ్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్.బి.అంకంగారు. తల్లిదండ్రులకు కావలసిన 21 సూత్రాలను పుస్తక రూపంలో ప్రతి గూటికి చేర్చాలన్న సంకల్పంతో ఉన్నారు. పిల్లల పెంపకంలో ఏర్పడుతున్న ఆ లోటును తీర్చడానికి ఎంతో కృషి చేస్తూ వున్నారు. జాతి సజీవంగా నిల బడాలంటే ఏం చేయాలి? సార్థకంగా సాగాలంటే ఏం చేస్తే సాధ్యమ వుతుంది? చిన్నప్పట్నుంచి పిల్లల మనస్తత్వాలక నుగుణంగా, ఒడుపుతో, నైపుణ్యంతో వారిని ఎలా పెంచగలగాలి? వంటి విష యాలను చాలా విపులంగా చర్చించిందీ పుస్తకం.

తెలుగులో అంకం అంటే తొడ అని అర్థం. తల్లీ, తండ్రీ పిల్లవాడిని తొడ మీద కూర్చోబెట్టుకుని లాలిస్తారు. పాలిస్తారు. డా.అంకం గారు కూడా మన పిల్లలందరినీ తొడ మీద కూర్చోబెట్టుకుని లాలిస్తున్నట్లుంది ఈ పుస్తకం.

ఎపుడూ అనారోగ్యం ప్రక్కనే ఔషధం వుంటుంది. అనారోగ్యాన్ని తలచుకొని కుమిలిపోవడం కాదు! ఔషధాన్ని అందుకొని కుదుట పడాలి. అందుకోండి ఈ ఔషధాన్ని ఎదిగిన మీ బిడ్డల్ని చూసి మురిసి పోండి! ముచ్చట పడండి!



-భారతీయం సత్యవాణి

# విశ్వకర్మల కవిత్వ పదకోశం డా॥మియాపురం శ్రీనివాస్

# "పెద్ద బాడిసె" కవితా సంకలనం

**శ్లో॥ విశ్వకర్మ జగన్నాథం విశ్వకర్మ జగద్గురుం!**
**విశ్వకర్మ జగత్తేజం విశ్వకర్మ మయం జగత్॥**

అంటూ అయిదు వృత్తి కులాలు విశ్వకర్మ సంబంధంగా ఉన్నారు. ఈ చరాచర సృష్టికి ఆధారంగా నిలిచింది. విశ్వకర్మల పనిముట్లు. అందులో ప్రధానమైనది చక్రమే. వడ్రంగులకు బాడిసె. ఇలా ఆదిమానవుడి నుండి నేటి వరకు వ్యవసాయానికి వాడుతున్న ప్రధాన ఉపకరణం నాగలి, తదుపరి వడ్రంగి వృత్తిలో ప్రధాన ఉపకరణం పెద్ద బాడిసె. ఆదిమ యుగం నుండి అధునాతన యుగం వరకు వడ్రంగి, కమ్మరి, కంసాలి, కంచరి, శిల్పి వృత్తికి వాడే పనిముట్లు, ఉపకరణాలు విశ్వకర్మల నుండేనని పెద్ద బాడిసె కవిత్వం రాసిన డా॥మియాపురం శ్రీనివాస్ అంటారు. వృత్తి రీత్యా వీరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. కరీంనగర్ కు చెందిన డా॥ మియాపురం శ్రీనివాస్ గత రెండు దశాబ్దాల నుండి కవిత్వం తెలుగు, ఆంగ్ల భాషల్లో సమాంతరంగా రాస్తున్నారు. అంతేకాక గతంలో వీరు నా కలం తెలంగాణా కొసమే, ఓ ఉపాధ్యాయుడా, కరోనాపై కవితా సంకలనాలు గతంలో అచ్చులోకి తెచ్చారు. అంతేకాక ఆంగ్లంలో వేవ్స్ అనే కవితా సంకలనాన్ని అచ్చు వేశారు. కవిగానే కాకుండా, కవితా చిత్రకారుడిగా పేరు గాంచారు. సాహితీ ప్రముఖులు, పురస్కారాలు పొందిన కవుల బొమ్మ లు వేస్తూ, దానికింద తన కవిత్వాన్ని జోడిస్తూ, సాహిత్య గ్రూప్ లలో వైవిధ్యంగా పోస్టింగ్ లు చేస్తూ, ఆక్టివ్ గా ఉంటారు.

వీరు ఇటీవల రాసిన పెద్ద బాడిసె కవితా సంకలనం కరీంనగర్ భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఇందులో వడ్రంగి, ఇతర సంబంధిత వృత్తులకు చెందిన ఉపకరణాలు, పనిముట్లపై కవితలను చక్కని కవితలు అల్లారు. విశ్వకర్మల వృత్తి కవితా పద కోశంగా దీన్ని అభివర్ణించవచ్చును. విశ్వకర్మల పంచవృత్తులలో ప్రాచీన పనిముట్లతో పాటు, ఆధునికంగా పారిశ్రామిక యుగంలో వచ్చిన యంత్రాలను, పనిముట్లను కవితల రూపంలో అప్‌డేట్‌గా పరిచయం చేయడం ఈ కవి మియాపురం శ్రీనివాస్ ప్రత్యేకతలు. వృత్తిరీత్యా వడ్రంగి కులానికి చెందిన మియాపురం ఆ వృత్తికి చెందిన ప్రాచీన, అధునాతన పనిముట్లను పరిచయం చేయడం పెద్ద బాడిసె కవితా సంకలనం ప్రత్యేకత. 144 పేజీల్లో నూరుకు పైగా పనిముట్లను పరిచయం చేశారు. వచన కవిత్వంలో ఇదొక అరుదైన ప్రయోగంగా నిలిచి పోతుంది. అంతేకాక 21 పేజీలలో టైటిల్ కవిత్వం పెద్ద బాడిసె పై దీర్ఘకవిత్వం రాసి వృత్తి మాధుర్యతలను, అధునాతన మార్పులను రసరమ్యంగా అక్షరీకరించారు. అలాగే నాగలిపై ఒక దీర్ఘ కవిత్వం రాశారు. పంచకర్మలకు చెందిన అవుసలి, వడ్రంగి, కమ్మరి,కంచరి, శిల్పి/ స్థపతి...వృత్తులపై పేజీకి మించని కవిత్వాలను రాశారు. కులవృత్తి, అంతేకాక పారిశ్రామిక యుగంలో ప్రత్యామ్నాయంగా వచ్చిన యంత్రాలను పరిచయం చేస్తూ కవితలను రాయడంలో మియాపురం ప్రయోగశీలిత్వం పాటకులను అలరిస్తుంది. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటూ వృత్తి పదకోశాన్ని సౌందర్యాత్మకంగా, తాదాత్మ్యం చెంది చెప్పటంలో ఈ కవి ,పరిణత, నిపుణతలు ఈ పెద్ద బాడిసె కవిత్వంలో పాయలు పాయలై చమక్కుమంటాయి. పోటీ పరీక్షలు రాసే నిరుద్యోగ విద్యావం తులైన పాటకులకు ఈ కవితా సంకలనం ఒక ఉపయుక్తమైన జీకే గైడ్ గా, ఒక జ్ఞాన నిధిగా కూడా అక్కరకు వస్తుంది. ప్రాచీన పనిముట్లే కాక సరికొత్త యాంత్రిక పరికరాలు, దాని వినియోగాలు తెలిసి వస్తాయి.





ప్రతులకు:మియాపురం శ్రీనివాస్ పూడూర్
9493264620

పెద్ద బాడిసె ముఖచిత్రం, వెనక పుటలో ఉపకరణాలు, పనిముట్ల ఫోటోలు వేసి, కవితా సంపుటి యొక్క ప్రాధాన్యతలను పాటకులకు వివరించే ప్రయత్నం చేశారు. ఈ కవితా సంకలనం నిండా ప్రయోగాల హరివిల్లు కనిపిస్తుంది,. కవియొక్క కల్పనా చాతుర్యాన్ని మెచ్చుకోలేకుండా ఉండలేం. విశ్వకర్మల ప్రాధ్యాన్యత లని వివరిస్తూనే, ఈ సంకలనాన్ని యావత్తు విశ్వకర్మలతో పాటు తన అమ్మానాన్నలకు అంకితం చేశారు. లోపలి పేజీలో విశ్వకర్మ చిత్రాన్ని వేసి, కవి తన మాట రాస్తూ, **సమస్త వృత్తుల ఆధారం విశ్వకర్మ/ సమస్త వృత్తుల పనిముట్లు, సమస్త దేవుల్ల రూపం విశ్వకర్మ/ ఆది నుండి సాంకేతిక యుగం వరకు,/ క్రవ వస్తువుల నుండి కంప్యూటర్ యుగం వరకు/, ఒక కొత్త ప్రపంచానికి విశ్వకర్మలు దారి చూపారని** అంటాడు. ఈ కవితా సంకలనానికి భవాని సాహిత్య వేదిక అధ్యక్షుడు డా॥ వైరాగ్యం ప్రభాకర్ ముందు మాట రాస్తూ, విశ్వకర్మను రుగ్వేదం సృష్టికర్తగా పేర్కొంది. దేవతల ఆయుధాలు, నగరాలు విశ్వకర్మ నిర్మించారు. లంక, ద్వారకానగరాల వంటివి. ప్రతి సంవత్సరం సెప్టంబర్ 17 ని విశ్వకర్మ జయంతిగా జరుపుకుంటారు. విశ్వకర్మ యొక్క అయిదు ముఖాల నుండి గోత్ర ఋషులు ఉద్భవించారు. అలాంటి విశ్వకర్మల వృత్తులపై మియాపురం రాసిన పెద్ద బాడిసె కవితా సంకలనం సామాజిక ప్రయోజనం కోసం ఆశించి రాశారని కితాబు నిచ్చారు. మానవుల జీవన విధానంలో అవసరమైన వ్యవసాయ, సినిమా, విద్యుత్, విద్యా, గృహ నిర్మాణ రంగంతో పాటు, పారిశ్రామిక, సాఫ్ట్ వేర్ రంగం వరకు విశ్వకర్మల ప్రాధాన్యతలు, వీరి పాత్ర ఇమిడి ఉందని కవి మియాపురం అంటారు. విశ్వకర్మల జ్ఞానాన్ని వివరించే పెద్ద బాడిసె ప్రతి ఒక్కరు చదవాలని కవి కోరుకొంటాడు.

విశ్వకర్మలు అనంతలోక సృష్టికర్తలు, విశ్వ పనిముట్లు, విశ్వవేదాలు, విశ్వ తొలి కిరణాలు అంటూ పెద్ద బాడిసె శీర్షికతో రాసిన దీర్ఘకవిత్వంలో విశ్వకర్మల పాత్ర గూర్చి కవితాపంక్తులను చెక్కుతాడు. విశ్వ బ్రాహ్మణ కాలజ్ఞానం, నిత్య సంఘటనల బ్రహ్మజ్ఞానం అంటూ బ్రహ్మంగారి కాలజ్ఞానం గూర్చి వివరిస్తారు.

**ఈ చరాచర సృష్టికి ఆధారంగా నిలిచింది విశ్వకర్మల పనిముట్లు. అందులో ప్రధానమైనది చక్రమే. వడ్రంగులకు బాడిసె. ఇలా ఆదిమానవుడి నుండి నేటి వరకు వ్యవసాయానికి వాడుతున్న ప్రధాన ఉపకరణం నాగలి, తదుపరి వడ్రంగి వృత్తిలో ప్రధాన ఉపకరణం పెద్ద బాడిసె.**

ఆలయ ధ్వజ స్తంభంపై కవిత రాస్తూ, అది ధర్మధ్వజం, ప్రజలందరినీ రక్షించే విజయ ధ్వజమని అంటాడు. ఇలా ఆలయాలను నిర్మించే వారు, దేవతల రూపకర్తలు విశ్వకర్మలైన శిల్పులేనని అంటాడు. దేవుడు, గోపురం, పసుపు పెట్టె, గౌరమ్మ పీట, కుంకుమ భరిణి, భజన పలకలు, పంచపాల, గంట, దేవాలయాలు, వాసం, మూల వాసం, దూలం, ఎనగర్ర, పరాట చెక్కలు, నాగలి, కచ్చురం, గొర్రు, జంబు,పొనక, యంత్రం, ఆకురాయి, చిర్నణం, పటాచి, గిర్మిట్, డ్రిల్ మిషన్, స్క్రూ డ్రైవర్, వెల్డింగ్ మిషన్, కటింగ్ మిషన్, రంపం, పట్టుకార్, టేపు, దాతి మొద్దు, మెట్లు, దుగోడ, కత్తికాస్, సట్టెపు రంపం, సుత్తె, దుగోడ, ఒడంబ, చిత్రక, బర్మా, ఆక్సో బ్లేడ్, చిన్న బాడిసె, గిరక, సంగడి, జాజు చిప్ప, పీటలు, ఇండ్లు, గడంచెలు, తనాబీ గూళ్ళూ, చేదబాయి, రాటు, మోట, ఏతం, కరెంట్ బావి, క్రేన్లు, బోర్ వెల్,కొంక, అరుగులు, భవంతులు, ఫర్నీచర్, రత్నం, ఖగోళం, చరిత్ర, గణితం, పిల్లన గోవి, హార్మోనియం, డోలు, వీణ, బ్లాక్ బోర్డు, కుర్చీ,పలక, బలపం, బల్ల,. బేంచి, బంతి, బొంగురం, సందుగు, బొట్టు పెట్టె, హార్వెస్టర్ వంటివి విశ్వకర్మ పనిముట్ల సంబంధితాలేనని అంటాడు. కంపాక్స్ బాక్స్, పెద్ద దర్వాజ, విజిల్, పెన్సిల్, సురుమ కలం, పాళీ, అగ్గిపెట్టె, ఊయల, మంచం, చిలక్కొయ్య, చెక్కదువ్వెన వంటివన్నీ విశ్వకర్మ సంజాతాలేనని కవి వాదిస్తాడు. ఇలా పాటకులకు ఈ పెద్ద బాడిసె కవితా సంకలనం ఒక కానుక.

దీన్ని విశ్వకర్మవృత్తుల సాహితీ లేదా కవితా పదకోశంగా అభివర్ణించవచ్చును.



**-సంకేపల్లి నాగేంద్రశర్మ**
80748 26371

పుస్తక సమీక్షలు

## కసి కసిగా వ్రాసిన కవితలు 'గుండె సవ్వడి'

'గుండె సవ్వడి' కవిత్వం పుస్తకంను రచయిత శశికుమార్ ముందుగా తనకు దైవస్వరూపులైన వారికీ, కవితా సంచిక ముద్రణకు సహకరించిన వారికీ, స్నేహగీతి అంటూ వారి అన్నయ్య డేనియల్‌గార్కి, మామయ్య నాంపల్లి కిషన్ గార్కి నూనావత్ తారాసింగ్ గార్కి, పెద్దన్నయ్య కుమారుడు కోడలికి, వారి మిత్రుడు అప్పాల బోజరాజుగార్కి, శశికుమార్ భార్య విజయలక్ష్మిగార్కి, కుమారుడు రామకృష్ణకూ ముందు పేజీల్లో చోటిచ్చారు. ఆపైన డి. రాజయ్యగారి, నేరెళ్ళ హన్మంతుగారి, చిన్నమ్మ, చిన్నాన్న సునీతా, సుదర్శన్ బెజ్జావార్ గారలూ, గుడి పాటివారి ముందు మాటలూ, వారి ప్రశంసా పూర్వక రచనలూ వున్నాయి. ఇక రచయితగా తన మాటగా శశికుమార్ గారి ముందు పలుకులు వాడిగా వేడిగా వున్నాయి. వారి రచనా సాహిత్యం కన్నీటి అనుభవాల్లోంచి పుట్టిందన్నది అక్షర సత్యం అన్నారు. రచయిత ఇంకా ఇలా వ్రాసారు. మనిషిని మార్చగలిగేది నేర్పించే సంస్కారం, సమాజాన్ని మార్చాలంటే నవచైతన్యాన్ని తెచ్చిపెట్టే సాహిత్యం కావాలి. అది బలమైన అక్షర సత్యాలను చవి చూపించాలి.

అవస్థల కడకండ్లు, శాసించే అజమాయిషీలు, గత్యం తరం లేని ప్రశ్నార్థకపు సమస్యలు, బ్రతుకునిండా అశాంతి యుతపు విషాదపు దొంతరలు. ఇవే తన కవితాక్షరా లకు తార్కాణాలు అన్నారు. నేటి సమాజ స్థితిగతులనూ పేర్కొన్నారు. ఆపైన ఇలా చెప్పారు. మనిషికి మనసు ఉండాలని చెప్పిన వాడు దేవుడు. మనసు ఎందుకు ఉండాలి 'మనీ' వుంటే చాలు అని చెప్పినవాడు నేటి స్వార్థం నిండిన మానవుడు.

ఈ తేడాను మరచి, సాంకేతిక పరిజ్ఞానం ముసుగులో జీవిస్తూ పురోభివృద్ధి పథంవైపు పరుగులిడుతున్న అసత్యాన్ని నెమరువే సుకొంటు, పతనాన్ని కొని తెచ్చుకుంటున్న ఇంగిత జ్ఞానం లేని ఆటవిక మానవునికని, క్రౌర్యం మూలంగా దెబ్బ తిన్న తన జీవితపు గుండె గాయంలోంచి పుట్టిన కన్నీటి అక్షరాలే 'గుండె సవ్వడి'లో విరచితమైన కవితలు అంటూ లెస్సగా పలికారు. ఇక కవితల్లో మొదటగా **'మా అమ్మ పీటరమ్మ'** అంటూ రాసిన రచనలో మళ్ళీ జన్మంటూ ఉంటే ఆమె కడుపులో కన్న కొడుకుగా పుట్టే అదృష్టంను కోరారు. సత్యం అన్న రచనలో సిరాచుక్క లేని కలం, కన్నీటి చుక్కలేని మనిషి జీవితం వ్యర్థమే, అర్థంలేని నిరర్థకమే అన్నారు. 'ఈ రెండు' అనే కవితలో ఓదార్పు దానికి కన్నీటికి మించిన స్నేహితుడు, పతనాన్ని చూపడా నికి స్వార్థం అనే దుష్టుడు ఎప్పుడూ మనిషి జీవితంలో తారసిల్లే వారే అంటూ ఎవ్వరు కావాలి అంటూ ప్రశ్నించారు, నీ ఆలోచన యే నీకు బలం, అదే ఆలోచన లేకుంటే నీ జీవితమే పతనం ఇది నగ్నసత్యం అంటూ చెప్పుకొచ్చారు. 'తేడా' అన్న రచనలో రిమిక్స్ మూలంగా దెబ్బతింటున్న పాతపాటల వలన కలిగిన బాధాకరమైన స్పందన వుంది. చనుబాలుకు లేదు కులం.





ప్రతులకు: బి.శశికుమార్
తెలంగాణ గురుకుల పాఠశాల
పోచంపాడ్ దమెండోరా మం॥
నిజామాబాద్ జిల్లా
సెల్: 99632 65159

కులం పేరుతో ఎందుకు నీకు అహం, అహం వదలాలి ప్రతి నిముషం అంటూ మరో స్ఫూర్తి దాయక కవితను అందించారు.

చాలా కవితలు చిన్నవిగా వున్నా టపాకాయల్లాగా ప్రేలాయి. చిత్రమాలికల్లో చూస్తే వారి సతీమణి విజయలక్ష్మి గారు కూడా సాహితీ వాసనలు ఉన్నవారుగానే కనిపించారు. నేర్చుకునేది, దార్శనిక దృశ్యం, నేటిస్థితి మార్గదర్శకం, మనిషి ఆలోచన, విశ్రాంతి లేని దేవుళ్ళు, నైజం, ఒక్కటే బాగున్నాయి. ప్రతి రచనలోనూ సమాజం దాని వికృత పోకడలూ కనిపిస్తాయి. ఎంతో నిక్కచ్చిగా చెప్ప దల్చుకుంది అక్షరాల ద్వారా చెప్పిన ఘనత ఈ కుమార్‌ది. మనిషిగా బ్రతకనిచో చచ్చాక- శవాన్ని చూసేవాడు వుండడు అన్న నిజం ఒక్కటే అంటారు ఈ యువకవి. బలవంతపు చితిమంటల్లో అత్యాచా రభరితమై భయానకంగా కాలింది ఆడతనం. ఆడపిల్లను కనడానికి ఆంక్షలు ఎన్నో, కానీ కామపు నోళ్లలో కనిపించే ఆకాంక్షలు ఎన్నో అంటూ వాతలు పెట్టారు.

ఇక వీరి ఆలోచనలకు అద్దం పడుతూ సాగిన కవితల్లో, మనిషికి మంచికి.. మానవతకు, కరెన్సీ కట్ల పాములకున్న విలువ లేదని తెలిసాక, రాక్షస కాలంపై కసిని పెంచుకోవడం మానకుండా వుంటుందా? అంటూ ప్రశ్నించిన శశికుమార్ కలం నుండి మరిన్ని చిట్టి పొట్టి కవితలు మరిన్ని రావాలని ఆశిద్దాం. ఇది శశికుమార్ రెండో ప్రచురణ. ఇది పాలపిట్ట వారి ప్రచురణ.



**- డా॥ పులివర్తి కృష్ణమూర్తి**
సెల్:9949092761

## పిల్లకోతి బద్ధకం (కథ)



సుందరవనం అనే అడవిలో వానరం అనే ఒక కోతి ఉండేది. దానికి ఒక బిడ్డ ఉండేది. దాని పేరు మర్కటం. అది తన బిడ్డకు ఆహార సంపాదనను నేర్పింది. కానీ ఆ పిల్ల కోతికి చాలా బద్ధకం.

అది వర్షాకాలం. ఒకరోజు అడవిలో జడివాన మొదలైంది. అది నిరంతరం కొనసాగింది. ఆ సమయంలో ఆ అడవిలోని జంతువులకు ఆహారం సంపాదించుకోవడమే చాలా కష్టమైంది. అప్పుడు ఆ వానరం తన బిడ్డతో "ఓ బిడ్డా! ఈ వర్షం తగ్గేలాగ లేదు. నేను నిన్ననే ఇక్కడికి దగ్గరలోని పండ్ల చెట్టుకు కాసిన పండ్లను తెంపుకొని రమ్మన్నాను. కానీ నీవు నీ బద్ధకం చేత తర్వాత తెస్తానని అన్నావు. తర్వాత ఆ సంగతే మరచి పోయావు. ఇప్పుడు ఏమైంది? నేను రెండు రోజులుగా అస్వస్థతతో ఉన్నాను. ఇప్పుడు నీకు,నాకు ఆహారం ఎవరు పెడతారు? ఈ వర్షాకాలం ఆహా రాన్ని ముందుచూపుతో నిలువ చేసు కుంటే ఈ కష్టం మనకు ఉండేది కాదు కదా!" అని అంది.

ఈ మాటలు విని ప్రక్కనున్న ఎలుగుబంటి ఇక్కడికి వచ్చి " ఓ మిత్రమా! ఇదిగో పండ్లు. నీవు చెప్పిన జాడని విని నా బిడ్డ ఈ పండ్లను నిన్ననే తెచ్చి పెట్టింది. ఈ భయంకర వర్షానికి ఎవ్వరం పోలేము. అందువల్ల ఆకలి అందరికి ఒకటే!నువ్వు ఎన్నోసార్లు నాకు పళ్ళను ఇచ్చి నా బిడ్డ ఆకలిని తీర్చావు. ఇది కూడా నీవు చెప్పిన జాడనే! అందువల్ల వీటిని తీసుకొని నీవు నీ బిడ్డ తినండి "అని కొన్ని పండ్లను అది కోతికి ఇచ్చి వెళ్ళింది.

వాటిని తీసుకున్న తల్లి కోతి "చూశావా బుజ్జీ! నీవు ఆరోజు వారికి ఆహారం ఇవ్వవద్దని అన్నావు. మనం ఆ సాయం చేయడం వల్లనే అది కూడా మనకు ఆహారాన్ని తెచ్చి పెట్టింది. మనం సాయం చేస్తే ఇతరులు కూడా మనకు సాయం చేస్తారు. నీవు నీ బద్ధకం వల్ల ఆహారాన్ని తీసుకొని రాలేదు. మనమే ఆహారం తెచ్చి వారికి ఇచ్చి ఉంటే మనకే ఒకరికి సహాయ పడ్డాం అన్న కీర్తి వచ్చేది. ఇంకెప్పుడూ ఇలా పనులను వాయిదా వేయకు. ఒకసారి అవకాశం పోతే మళ్ళీ రాదు. అది గుర్తుంచుకో!" అని అంది.

తన బద్ధకం వల్లనే ఇలా జరిగిందని తెలుసుకున్న ఆ పిల్ల కోతి ఆ రోజు నుండి తల్లి చెప్పిన ఏ పని నైనా వాయిదా వేయకుండా వెంటనే చేస్తూ క్రమం క్రమంగా తన బద్ధకాన్ని పోగొట్టుకుంది. అందుకు ఆ తల్లి కోతి ఎంతో సంతోషించింది.



**-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య**
9908554535

## ప్రేమ పరిమళం

సుగంధంలా చల్లిన ప్రేమ పుప్పొడి
మనసు పొరల్లో పదిలంగా దాగి ఉంది.
తియ్యటి మాటలతో మెత్తటి హృదయాన్ని కదిలించి
మమతల పొదరిల్లులా అల్లుకున్నావు.
ఆనందాల చెలిమి కట్టి
ఆ చెలిమిలో చెలియా వలపునే చూసావు.
అమాయకత్వపు వయసు.
ఆలంబన కోసం అర్రులు చాచింది.
ఆప్యాయంగా అల్లుకున్న బంధం
పెళ్లి పుస్తకంలో పేజీలు తిరగేసి
తొలి జ్ఞాపకాల సంతకాలతో
నీవే నా లోకమని ప్రళయాంబుధిలో
ఓలలాడి మైమరచిపోయాము.
ప్రేమ మకరందాన్ని గ్రోలుతూ
వసంతంలో చిగుళ్ళు తొడిగి
వలపు పంట పండించుకున్నాము.
కొత్త మొగ్గలు తొడిగి మమకారపు బంధాలు పెరిగాయి.
రెక్కలు అలసిన వేళ స్వార్థపు చీకట్లు ముసిరి
దాచుకొన్న పండు వెన్నెలలన్నీ
అమావాస్య చీకటిలో
గూడు వదిలిపోయిన గువ్వలు.
రెక్కలొచ్చాయని సంబరపడ్డాయి.
పైపైకి చిరునవ్వులు పులుముకొని
దూరమైన రక్త సంబంధాల కోసం
రుధిరాలు అర్పిస్తూ, చెమర్చిన కళ్ళను తుడుచుకొని
కాలం వాకిట్లో బాధలు బరువైనా
ఎల్లలు లేని సంసారానికి ఏదో తెలియని ఆనందం.
నాకు నువ్వు నీకు నేను. ప్రేమ పరిమళాలను ఆస్వాదిస్తూ
చివరికి మనమిద్దరమే!
బిడ్డలున్న అనాథలం. అమ్మానాన్నలం.



**-తాటి కోల పద్మావతి**
9441753376

## కోపం కూడా మంచిదేనా !

కోపం ఎంత మంచిదో కదా..
గురువు కోపం బుద్ధి బోధిస్తుంది
స్నేహితుల కోపం దారి చూపుతుంది
శత్రువు కోపం జాగ్రత్తను నేర్పుతుంది
అమ్మ కోపం కడుపు నింపుతుంది
నాన్న కోపం బతుకు బాట చూపుతుంది
పెద్దల కోపం మంచి చూపుతుంది
ఓటమి కోపం కసిని పెంచుతుంది !.
కోపంతో జర జాగ్రత్త సుమా..
కోపంలో నోరు జారవద్దు
నిర్ణయం తీసుకోవద్దు
వస్తువుల్ని విరగొట్టవద్దు
చేయి, కాలు లేపవద్దు
దూకుడు పెంచవద్దు
ప్రతిచర్యకు పూనుకోవద్దు !.
కోపం తెచ్చే అనర్థాలు ఎన్నో..
కోపం బీపీని పెంచేస్తుంది
ఆరోగ్యాన్ని పాడుచేస్తుంది
దీర్ఘ దర్శనం లోపిస్తుంది
విజయాన్ని దూరం చేస్తుంది
నిర్ణాయక శక్తిని మింగేస్తుంది !.
కోపం తెచ్చే తంటాలెన్నో కదా..
కోపం వృత్తిని నష్టపరుస్తుంది
నేరానికి పునాది అవుతుంది
సంబంధాల్ని దెబ్బతీస్తుంది
నిద్రను హరింపజేస్తుంది
నిరాశను పెంచుతుంది
ఆందోళనలను కలిగిస్తుంది !.
కోపంలో చేయదగినవి..
కోపంలో అంకెలు లెక్కించడం
నినాదంగా నీరు తాగడం
దీర్ఘ శ్వాస తీసుకోవడం
కారణ విశ్లేషణ చేయడం
మౌనవ్రతం పాటించడం



**-మధుపాళీ**
9949700037

## పూసలదండ

చెయ్యెత్తి జై కొట్టినా
తల వంచి నమస్కరించినా
అంతా నా చలువే.
కంటికి కనిపించను
కనువిందు చేయను
కానీ నీ కలల సాకారానికి
ఆయువుపట్టును.
అంతరాలకు నేను వ్యతిరేకం
లింగభేదాలకు నేను అతీతం.
ప్రాంతీయతలు నాకు పట్టవు
స్వపరాలు నాకు గిట్టవు.
తెర వెనుక సూత్రధారినై తెరమీద
పాత్రధారులను నడిపిస్తుంటాను
నేను మౌనముద్రలో ఉండి
నిన్ను శబ్దభేదిని చేస్తాను
నేను నిశ్చలంగా ఉండి
నిన్ను చలనశీలిగా మారుస్తానుజ
నాతో చెలిమి నల్లేరుపై నడకే
నాతో వైరం అసలుకు ఎసరే.
మోయలేని బరువును మోపి
మొరాయించానని నిందించకండి
అడుసులో కాలేసి నెపం నాపై నెట్టకండి
అధర్మాన్ని ఆశ్రయించి
నన్ను అపరాధిని చేయకండి
పరుగుల పయనంలో అలసిన నాకు
కాస్త విశ్రాంతి నివ్వండి
ఇంతకీ నేనెవరినని అంటారా?
సూత్రాలకు లోబడి
నియమాలకు కట్టుబడి
పడవ నడిపే సరంగును
విధాత రచనలోని ఓ అద్భుతాన్ని
షట్చక్రాలకు ఆధార స్తంభాన్ని
72 వేల దారాలతో కూర్చబడిన
33 పూసల దండను

*(మానవ శరీరంలోని వెన్నెముకపై అల్లిన కవిత)*



**- పద్మశ్రీ చెన్నోజ్వల**
7670860590

## ఆకాశమూ, నేలా !

ఆకాశం అచ్చువడం లేదు నేల మీద!
అబద్ధాల అబద్ధాల యుద్ధాల కాలం లో
ఆకాశం అచ్చువడం లేదు నేల మీద!
చినుకుల తీగెలు
నేల పందిరి మీద అల్లుకోవడం లేదు!
మరపుతో కరువు ఏర్పడడం లేదు
చెరుపుతో వాలుతుంది కరువు
రాశులు రాశులు గా
ఊసుళ్ళ పోగులుగా
పేదలు పోగవుతున్నారు!.
నిట్రాటలు లేని గుడిసెలు
పుట్టుకొస్తున్నాయి !
మనిషి మనిషి
కరచాలనాలు చేసుకోవడం లేదు
భుక్తాలింగనాలకోసమే
అరచేతులు నొక్కుతున్నారు!
ఫిర్యాదుల నిప్పులగుండం లో
ఈదులాడుతున్నాడు మనిషి!
నేత్రాలనుంచి
కరుణ ఊరడానికి బదులు
లావా విరజిమ్ముతుంది !
అబద్ధం ధర్మభద్దము గా
చలామణి అవుతుంది
కాపురాలు లేని గోపురాలు
పుట్టగొడుగుల్లా
పుట్టుకొస్తున్నాయి !
గరిక పచ్చికని
మచ్చిక చేసుకోవడం లేదు !
ఆకాశాన్ని
నేల మీద
ముద్రించడం లేదు !



**-ఒబ్బిని**
9849558842

## నువ్వేంటో వాళ్ళకు చెప్పు

ఏదో సర్దుకుపోతుందని...
సబలే కాని అబల కాదని...
ఆమె విశ్వరూపాన్ని తక్కువ అంచనా వేయొద్దని,
మునుపే హెచ్చరించా... శతాబ్దాలుగా వినలేదు!
ఈ సమాజ మగారణ్యంలో...
మృగాల ఊహల ప్రహసనాల్ని చీల్చుకుంటూ,
ఎదుర్రొమ్మున నిలబడి...
ఇప్పుడు సరికొత్త విస్ఫోటనమై నడుస్తోంది!
ఇప్పుడు ఆమె ప్రాణాల్ని గూప్పెట్లో పెట్టుకునేం బతకట్లేదు!
ఆకాశంలో చుక్కల కన్నా...
పక్షి రెక్కల విసుర్ల కన్నా...
గర్జించే మృగరాశి కన్నా...
ఆమె పిడికిలి ఏమాత్రం తక్కువ కాదు!
కాదు... అది కేవలం పిడికిలి కాదు!
శతాబ్దాల బానిసత్వాన్ని బద్దలుకొట్టే ఉక్కు సుత్తి!
నిరంకుశ గర్వాల్ని చీల్చే చేతన కత్తి!
నిన్నటి వరకు అణచివేసిన చీకటి సామ్రాజ్యానికి
ఇది ఆఖరి క్షణం...
ఆమె అడుగుల్లోంచి పుట్టుకొచ్చే
అజేయ శకానికి ఇది మహా ప్రారంభం!
ఆమె ఇప్పుడు వెనక్కి తిరిగిచూసే అబల కాదు,
కాల గమనాన్ని శాసించే యుగాంతం...
సరికొత్త సృష్టిని నిర్మించే యుగారంభం!



**- సర్వేశ్వర రావు నీలం**
6304664725

## శ్రమైక జీవన సౌందర్యానికి మూలం సంగీతం

ప్రకృతి చేసే ప్రతి సవ్వడి ఒక సుస్వరమై
మనసుమబ్బు తెరలకు ప్రశాంతత నిచ్చేది
మానసికొల్లాసానికి నిలయం సంగీతం.

వరినాట్లలో పొలాలగట్లలో పనిచేస్తూ
అలసిన దేహాలకు ఆలంబన సంగీతం
శ్రమైక జీవనసౌందర్యానికి మూలం సంగీతం

స్వరాష్ట్ర సాధనకై జరిగిన సమరంలో
డప్పుల దరువులతో చైతన్యపరిచిన ఉద్యమ గీతం సంగీతం
ఉద్యమాలకు ఊపిరి పోసింది సంగీతం.

తల్లి జోలపాటలోని కమ్మదనం
పసిపాపల హృదయాలను పరవశింపజేస్తది
మనసును ఆనందతీరాలకు చేర్చేది సంగీతం

రాజుల కాలంలో కళారూపంగా ఎదిగి
సంగీత కచేరీలకు నెలవైన రాజదర్బార్లు
రాజ్య వైభవానికి ప్రతీక సంగీతం



**-డి. రాములు**
9391276057

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1828వ రోజు 'భయం' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'భయం' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -సంపాదకులు

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839



## దడదడ

దేహదారుఢ్యం తగ్గి
మానసిక దౌర్బల్యం పెరిగి
గుండెలో దడదడ
మనసులో గుడగుడ.
వంటికి చెమటలు
కంటికి మసకలు
మనసుకు గుబులు
చుట్టూ అలుకున్న చీకట్లు.
ఎందుకు భయం
దేనికి భయం
ఎక్కడో వణుకు
ముందుకు పోవాలన్న తత్తరబాటు
పనుల ఆటంకాలకు దిగులు
సాధించాలంటే అనుమానం.
పామును చూస్తే మనిషికి
మనిషిని చూస్తే పాముకు
పిల్లిని చూస్తే ఎలుకకు
ధైర్యంతో పరుగులు
ప్రాణ రక్షణకు ప్రణాళికలు.
స్వార్థం కొరకు దోపిడి
అత్యాశకు నిచ్చెనలు
పట్టుబడుతున్న తిమింగలాలు
అయినా వీడని భయం.
భయానికి భయం వేస్తే అధోగతి
నువ్వు వెళ్ళలేవు పురోగతి
వెనుకపడితే వెనకేనోయ్
ధైర్యముంటే ఉత్సాహం
కలుగుతుంది విజయం.
నవరసాలలో ఒకటి భయానకం
అభయహస్తం చూపే దేవ గణం
నీ మనసే నీకు ధైర్యం
భయానికి కలిగించకు స్థానం!!.

-డా. చీదెళ్ల సీతాలక్ష్మి

## ఒకప్పుడు...

ఒకప్పుడు
పిల్లలకు తండ్రులంటే భయం
అమ్మమ్మలు నానమ్మలు
చెప్పే కథల్లో
దయ్యాలు భూతాలు
రాక్షసులంటే భయం
బడిలో చేరినాక పంతుళ్లంటే భయం
పెద్దగైతుంటే పరీక్షలంటే భయం
తక్కువ మార్కులొస్తే
పరీక్ష తప్పితే
తల్లిదండ్రుల భయం
భయం అధికమైతే
ఆత్మహత్యా ప్రయత్నం
పరీక్షల్లో పాసైనా
పోటీ పరీక్షల్లో నెగ్గలేమోనన్న భయం
ఉద్యోగాన్వేషణలో
విఫలమైతానేమోనన్న భయం
ఉద్యోగ జీవితంలో
బాస్ తో భయం
ఆ తర్వాత
సంసార సముద్రాన్ని ఈదడంలో భయం
మధ్య మధ్యలో వచ్చే ఆర్థిక ఇబ్బందులు
శారీరక మానసిక అనారోగ్య సమస్యలు
కొందరికి నీళ్ల ఫోబియా
కొందరికి కరెంటు ఫోబియా
కొందటికి ఎత్తైన ప్రదేశాలంటే
విమాన ప్రయాణాలంటే ఫోబియా
ఒకటేమిటి
తలచుకుంటే జీవితమంటేనే భయం
పెట్టి పుట్టిన వాళ్ళు కొందరుంటారు
బాధలు భయాలు
అనుభవంలోకి రానివారు.

-నాగిరెడ్డి అరుణ జ్యోతి

## లక్షణం

భయం
మానవ సహజ లక్షణాలలో ఒకటి
భయాన్ని జయించడమే
మనిషి ముందున్న అంశాలలో
ప్రధానం
భయము నెదిరించి
సవాలు సాధించడమే గొప్ప
ప్రతి విషయసాధనలో
జయాపజయాలనెదుర్కొనే
ఓ తత్వము కూడా
సదరు అలవర్చుకొనే లేదా
అభ్యసించే వాటిలో ముఖ్యం
ఘటనా ఘటన సమర్థుడైనప్పటికీ
కొన్ని విషయాలలో మోసాలు
సైతం
భయాన్ని వీడి
సమర్థవంతంగా ఎదుర్కొని
ఎదుర్లేని వాడిగా
కోర్టు కేసుల్లో సైతం
భయాన్ని వీడి
ముందడుగేసే వ్యక్తే
నేటి ధీటైన వ్యక్తులకో
మచ్చుతునక
మోసపూరిత ఘటనకు
మోసాలే సవాలు
భయాన్ని వీడి
ప్రతిఘటనను ప్రతిఘటించుటే
ఘటనా ఘటన సమర్థుల లక్షణం.

-ఏ.శ్రీరామారావు

## ఉండాలి దూరంగా

ప్రతి మనిషికీ జీవితంలో
ఏదో ఒక సమయంలో
కలుగుతుంది భయం.
కొంతమందికి మనుషులను చూస్తే
కొంతమందికి బల్లులని చూస్తే
కొంతమందికి బొద్దింకను చూస్తే
భయం .. భయం.. భయం.
కొంతమందికి పాములంటే భయం
కొందరికి తండ్రి అంటే భయం.
కొంతమందికి తోబుట్టువు అంటే భయం.
కొంతమందికి ప్రత్యేక గురువులను చూస్తే
భయం.
కొంతమందికి ఆఫీసులో
పై అధికారి అంటే భయం.
కొందరికి సహోద్యోగులు అంటే భయం.
కొంతమందికి హారర్ సినిమా చూస్తే భయం.
భయం ఉన్నప్పుడు
ఆ వ్యక్తి మాటలను
బాగా విని అర్థం చేసుకుంటే
భయం పోవచ్చు.
తల్లితండ్రులు అంటే
భయం ఉన్నప్పుడు
తల్లిదండ్రులే ఆ భయాన్ని పోగొట్టాలి.
గురువు అంటే భయం ఉంటే
పాఠాలను శ్రద్ధగా చదవాలి
గురువు మాటలను శ్రద్ధగా వినాలి.
తప్పు చేసినవారికి తప్పకుండా ఉంటుంది
భయం.
నిజాయితీ లేని మనిషికి
ఉంటుంది భయం.
భయం ఉంటే
మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది.
అబద్ధం చెప్పిన వారికి
ఉంటుంది భయం
నిజం ఎక్కడ తెలుస్తుందోనని.
భయాలు ఉండకుండా ఉండాలంటే
నిజాయితీగా ఉండాలి
నిజమే చెప్పాలి.
నిజాయితీగా ఉంటే
నిశ్చింతగా ఉండవచ్చు.
కానీ నిజాయితీగా ఉన్న వాళ్ళని
పైకి రానివ్వరు ఈ ప్రపంచంలో.
అటువంటి వారికి ఉండాలి దూరంగా.

-డా. షహనాజ్ బతుల్

## పామైనా తాడే

చుట్టూరా భయానక చీకట్లు
కమ్ముకొన్నపుడు
దివిటీలా దారిచూపగల
మహా విపత్తునైనా ఎదుర్కోగల
మాయదారి
రోగాన్నైనా తట్టుకోగల
మహోద్యమాలను నడిపించగల
మహాబలుడినైనా ఎదిరించగల
మంచుకొండలనైనా
అధిరోహించగల
మనోధైర్యం తోడుంటే
పామైనా తాడే!.
అదిలేనినాడు
తాడే పామై భ్రాంతి కలిగిస్తుంది!.
వీపున పసిదానితో పాటు
చేతిన కరవాలంతో
యుద్ధం చేసిన
ఝాన్సీ లక్ష్మీబాయికి
అవహేళనలనెదుర్కొని
రాజ్యపాలన గావించిన
రుద్రమదేవికి
తోడుగా నిలిచింది
వారి మనోధైర్యమే!.
బలహీనమైన క్షణాల్ని
ఆలోచనల్ని పారద్రోలి
బలమైన మనోధైర్యపు
ఆయుధంతో ఎదుర్కొంటే
ఏనుగు వంటి సమస్యైనా
చీమలా చిన్నదౌతుంది!.
మానసిక శాస్త్రవేత్తలు చెప్పే మాట
దేనిగురించయితే
భయానికి లోనవుతారో
ఆ పనే పదే పదే చేస్తూ ఉండమని
భయం పరుగెత్తి పారిపోతుందని!.

-చంద్రకళ దీకొండ

## భయం ఉండాలి

భయం ఉంటేనే
బతుకు చేతిలో ఉంటుంది
దారిలో నడిచేటప్పుడు
ఎత్తు పల్లాలు దాటేటప్పుడు
ఎక్కడ జారిపడతామో
ఆచితూచి అడుగు వేస్తాం.
అహంకారంతో, ఆతృతతో
వాహనం నడిపే మనుషులు
గుంతలో నీళ్లను
చిమ్మేలా ఉరుకుతారు
అప్పుడు మనమే
భయంతో
ఆ బురద నీళ్లు మీద పడకుండా
పక్కకు తప్పుకోవాలి .
నలుగురితో మాట్లాడేటప్పుడు
పెద్దలను కలిసినప్పుడు
మాటలు తొర్లకుండా
మర్యాద పోకుండా
గౌరవ మర్యాదలతో
మాట్లాడేందుకు
భయం వెంటనే ఉండాలి .
యుద్ధానికి సిద్ధమైనప్పుడు
ఎక్కడ ఓడిపోతామో అన్న భయంతో
అన్ని జాగ్రత్తలు
పక్కాగా తీసుకొని దిగుతారు.
బిడ్డను కనే తల్లి
పురిటి నొప్పులు
చక్కగా తట్టుకోకపోతే
నా బిడ్డకు ఏమైనా
అవుతుందో అన్న భయంతో
చావునైనా ఆహ్వానిస్తుంది
బిడ్డ కోసం .
బతుకు నుండి చావు వరకు
భయం, ధైర్యం, పిరికితనం
అన్ని ఉంటాయి ప్రతి మనిషిలో
ఒక్కొక్కసారి కాలానికి భయపడాలి
మనుషులకు భయపడాలి
పరిస్థితులకు భయపడాలి
ఓటమిని కూడా ఒప్పుకోవాలి .
భయం వెంట లేకుంటే బతుకు లేదు
భద్రత లేదు.
భయం విడిచి
పిరికితనం తోడు చేసుకుంటే
బతుకు శూన్యం
బతుకు భారం
ప్రతి ఒక్కరికి.

-పొన్నాల ధనమ్మ

## భయమేల! అడుగేయి ముందుకు!

భయం ఒక మానసిక దౌర్బల్యం!
భయం లేక బతికే మనిషే ధీరుడు!
ధైర్యాన్ని పలకరించు భయమేస్తే!
భయం తోక ముడుచుకు పారిపోతుంది!
నీరు చూస్తే కొందరికి భయం!
పాముని చూసి పరిగెడతారు కొందరు!
బొద్దింకలు అంటే భయం కొందరికి!
కుక్క అరుపుకే కూలబడతారు కొందరు!
ఎత్తు ప్రదేశాలు అంటే భీతి కొందరికి!
ఒంటరిగా ఉండటం అంటే భయం!
సభలలో మాట్లాడమంటే భయం!
తోడు లేక నడవడం అంటే భయం!
ఎందుకు మీకందరికీ భయం!
ధైర్యంగా ముందడుగు వేస్తే చాలు!
పరీక్షలో ఫెయిల్ అయితే
నాన్న కొడతారనో
ప్రేమ గురించి చెప్తే
కన్నవారు తిడతారనో
ఏదైనా కోరితే భర్త కసురుతాడనో
బడికి లేటుగా వెళితే
గురువు కోప్పడతాడనో
భయపడక సరిగా వివరిస్తే చాలు!
అర్థం చేసుకుంటారు వారందరూ!
నీ భయం పటాపంచలై వస్తుంది ధైర్యం!
ధైర్యం ఒకసారి రాగానే తలుచుకో
ఝాన్సీ లక్ష్మీబాయి సాహసాన్ని
రుద్రమదేవి చూపిన ధైర్యాన్ని
ఆంగ్లేయులతో అల్లూరి పోరుని
నీలోనూ పురుడు పోసుకొను ధైర్యం!
భయం భయపడి పలాయనమగు!
ధైర్యే సాహసే లక్ష్మీ అన్నారు కదా !!

-కోలా సత్యనారాయణ

## తన భయమే తనకు శత్రువు

ఒకరి భయం
మరొకరికి లాభం
వర్తమానం భవిష్యత్తుల
వైరమే భయం,
భయం శక్తిసామర్థ్యాల త్రొక్కి
తిరస్కరించు జయం,
భయం నమ్మకాన్ని
కప్పిపుచ్చి నష్టపరుచు సఖ్యం
భయం మనుగడకి పెద్ద అవరోధం.
భయమనేది
మదిలో బీజమెత్తితే
నీ నీడకు నీవే భయపడ్తే
ఆపద వస్తుందేమోనని
ప్రమాదాలకు గురైపోతే
రక్షణకే భయం మసిపూసేస్తే
గతి లేని బతుకులో
స్థితిని పోగొట్టుకొంటావు.
భయం
ఆరోగ్య క్షీణతకు కారణం
ప్రగతికి అవరోధం
ధైర్యానికి శత్రువు.
అనుమానాలకు దోహదం.
వీర సైనికులు భయమంటే
దేశ గతి ఏమవుతుంది?
రణరంగాన భయమంటే
సమరమెలా సాగుతుంది?
కష్టనష్టాలు ఊహించి
సంకల్పాలకు దూరమైపోతే
జీవంలేని బతుకు
సారంలేని సేద్యం.
చరిత్రలో
భయమనే పిశాచిని
తుత్తునియలు చేసిన వీరులెందరో
భయమనే ముసుగులో
అస్తిత్వాన్ని కోల్పోకు.
తన భయమే తనకు శత్రువు
గదరా సుమతీ!.

-రాజప్ప

# “ప్రణమిల్లే పాదాలు” ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో పెద్దూరి వెంకటదాసు, పొత్తూరి సుబ్బారావు, బైస దేవదాసు, శ్రీమతి అంజలి ప్రసన్న. శివ రేవాంశ్, తెల్లపురి సుధీర్‌కుమార్, ఆవిష్కర్త డా॥ ఏనుగు నరసింహారెడ్డి, ఆచార్య టీ. గౌరీశంకర్, శ్రీమతి శైలజామిత్ర, ఎస్.నరసింహరాజు, మౌనశ్రీ మల్లిక్, రచ్చ రవి.

హైదరాబాద్, జులై 22:తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ, జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో, జులై 12న రవీంద్రభారతి సమావేశం మందిరంలో తెల్లపురి సుధీర్ కుమార్ కవితా సంపుటి ప్రణమిల్లే పాదాలు ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రారు ఆచార్య టి. గౌరీ శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రసిద్ధ కవి, సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పుస్తకాన్ని సినీ కవి మౌనశ్రీ మల్లిక్ కు అంకితం ఇచ్చి,



మౌనశ్రీ మల్లిక్ దంపతులకు 'ప్రణమిల్లే పాదాలు' కవితా సంపుటిని అంకితం ఇస్తున్న తెల్లపురి సుధీర్‌కుమార్ దంపతులు.

ఘనంగా సత్కరించారు. అనంతరం నరసింహారెడ్డి మాట్లాడుతూ.. తెల్లపురి సుధీర్ కుమార్ కవిత్వం ఆధునికతను సంతరించుకుందని, అతడు భవిష్యత్తులో ఉత్తమశ్రేణి కవిగా రాణిస్తాడని, సంపుటిలోని కవితలన్నీ వైవిధ్యభరితంగా ఉన్నాయని, అనుభూతి ప్రధానంగా కవిత్వాన్ని రాశారని అన్నారు. టి. గౌరీ శంకర్ మాట్లాడుతూ.. సుధీర్ చిన్న వయసులోనే కవిత్వంలో శిల్పాన్ని అందిపుచ్చుకున్నారని అన్నారు. విశిష్ట అతిథి బైస దేవదాస్ మాట్లాడుతూ.. సుధీర్ కుమార్ అమ్మ మీద రాసిన మొదటి కవిత నేటినిజం లో ప్రచురింపబడిందని, అతడు రెండవ కవితా సంపుటి వరకు చేరుకోవడం గర్వంగా ఉందని సుధీర్ రాసిన మొదటి కవితను చదివి వినిపించారు. ప్రత్యేక అతిథి సీనియర్ కవయిత్రి శైలజామిత్ర మాట్లాడుతూ.. సుధీర్ కవిత్వమంతా చదివానని, తను ఎంచుకున్న వస్తువులను కవితలుగా మలచడంలో విజయం సాధించారని పేర్కొన్నారు. ఆత్మీయ అతిథి పెద్దూరి వెంకటదాస్ అతిథులను ఆహ్వానించి, రెండు దశాబ్దాలుగా సుధీర్ తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన సినీ నటుడు రచ్చ రవి మాట్లాడుతూ.. తనకు సాహిత్యం అంటే ఎంతో ఇష్టమని, రాజమండ్రిలో షూటింగ్ ఉన్నప్పటికీ, ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్న ఉద్దేశంతో షూటింగ్ అడ్జస్ట్ చేసుకుని వచ్చానని సుదీర్ ను అభినందించారు. పుస్తక సమీక్ష చేసిన సరికొండ నరసింహరాజు సుధీర్ లో కవితావేశం మెండుగా ఉందని, అతడు శబ్దాన్ని, శిల్పాన్ని ఒడిసి పట్టుకున్నాడని, అద్భుతమైన సమీక్ష చేశారు.మరొక అతిథి పొత్తూరు సుబ్బారావు యువకవిని అభినందనలతో ఆశీర్వదించారు. కృతిని స్వీకరించిన ప్రముఖ కవి, సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ స్పందిస్తూ.. రెండు దశాబ్దాల క్రితం హైదరాబాదులో అడుగుపెట్టిన సుధీర్ కుమార్ ను చేరదీసి కవిత్వంలో మెలకువలు నేర్పి కవిగా తీర్చిదిద్దిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. సుధీర్ కు కవిత్వం అంటే ఏమిటో చెప్పినందుకు, తనకు కవిత్వాన్ని అంకితం ఇచ్చాడని, చెప్పారు. అనంతరం సుధీర్ కుమార్ స్పందిస్తూ తను కవిగా ఇంత దూరం ప్రయాణం చేయడానికి గల కారణమైన మౌనశ్రీ మల్లిక్ కు, అతిథులుగా విచ్చేసిన సాహితీమూర్తులకు, తన తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు, స్నేహితులకు పేరుపేరునా కృతజ్ఞతలు చెప్పారు.వందన సమర్పణలో భాగంగా వేదికను కల్పించిన లయన్ వివి రాఘవ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలియజేశారు.

# భారత జాతీయోద్యమ పిత బాలగంగాధర తిలక్



బాలగంగాధర తిలక్ (జూలై 23, 1856 - ఆగష్టు 1, 1920) స్వరాజ్య పోరాటంలో పాల్గొన్న తొలితరం త్యాగమూర్తులతో బాల గంగాధర తిలక్ అగ్రగణ్యులు. ఆయనను భారత జాతీయోద్యమ పితగా పేర్కొంటారు. తిలక్ జాతీయోద్య మాన్ని కొత్తపుంతలు తొక్కించాడు. దేశ వ్యాప్తంగా సామాన్య ప్రజలను ఉద్యమంలో పాల్గొనేటట్లు చేయడంలో ఆయన పాత్ర మరిచి పోలేనిది. భరత జాతిని స్వాతంత్ర్య సమరోత్సాహంతో జాగృత మొనర్చిన మహానేత లోకమాన్య తిలక్. అందుకే ఆయ నను భారత దేశంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేగిన అశాంతికి మూల కారకుడుగా భావిస్తారు.

బాలగంగాధర తిలక్ 1856 జూలై 23వ తేదీన మహారాష్ట్ర రాష్ట్రంలోని రత్నగిరిలో మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి గంగాధర్ రామచంద్ర తిలక్ సంస్కృత పండితుడు, ఉపాధ్యాయుడు. బాల్యంలో తిలక్ చాలా చురుకైన విద్యార్థి. ప్రత్యేకించి గణిత శాస్త్రంలో విశేష ప్రతిభ కనబరచేవారు. చిన్నప్పటి నుంచి అన్యాయం ఎక్కడ జరిగినా సహించని గుణమాయనది. నిజాయితీతో బాటు ముక్కుసూటి తనం ఆయన సహజ గుణం. కళాశాలకు వెళ్ళి ఆధునిక విద్య నభ్యసించిన తొలితరం భారతీయ యువకుల్లో ఆయనొకరు. ఆంగ్ల విద్యను అందుకున్న తొలి తరం భారతీయుల లో అగ్రగణ్యులు. ఆంగ్ల విద్య ప్రభావంతో భారతీయులు అనుభవిస్తున్న బానిసత్వం గురించి తెలుసుకున్న వర్గంలో కూడా తిలక్ అగ్రగణ్యులే.

తిలక్ కు పదేళ్ళ వయసున్నప్పుడు అతను తండ్రికి రత్నగిరి నుంచి పుణెకు బదిలీ అయింది. ఇది తిలక్ జీవితంలో పెనుమార్పు తీసుకు వచ్చింది. ఆయన అక్కడ ఆంగ్లో-వెర్నాక్యులర్ పాఠశాలలో చేరి కొందరు ప్రసిద్ధి చెందిన ఉపాధ్యాయుల వద్ద విద్యనభ్యసించారు. ఐతే పూణెకు వచ్చిన కొంతకాలానికే అతను తన తల్లిని, పదహారేళ్ళ వయసులో తన తండ్రిని కోల్పోయారు. మెట్రిక్యు లేషన్ చదువు తున్నప్పుడే సత్యభామ అనే పదేళ్ళ అమ్మాయితో పెళ్ళయింది. మెట్రిక్ పాసయ్యాక అతను దక్కన్ కళాశాలలో చేరారు. 1877లో అతను గణిత శాస్త్రంలో ప్రథమ శ్రేణిలో పట్టభద్రు డయ్యారు. ఆ తర్వాత తన చదువును కొనసాగించి ఎల్ ఎల్ బి పట్టా కూడా పొందారు. తిలక్ 1890లో కాంగ్రెస్ లో చేరారు. కానీ త్వరలోనే కాంగ్రెస్ మితవాద రాజకీయాలపై నమ్మకం పోయింది. స్వరాజ్యం కోసం పోరాటమే సరైన మార్గమని అతను నమ్మారు. అప్పటి వరకు కాంగ్రెస్ ప్రతి సంవత్సరం డిసెంబరు చివరి వారంలో మూడు రోజుల పాటు సమావేశమై బ్రిటిష్ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాల గురించి మెతక వైఖరి తో చర్చించడానికే పరిమితం అయ్యేది. మితవాదుల ధోరణి సమ్మతంగా ఉండేది కాదు. విన్నపాలు, వినతులు వలస ప్రభుత్వాన్ని లొంగదీయ లేవని తిలక్ సిద్ధాంతం. దాదాభాయ్ నౌరోజీ అంటే ఎంతో గౌరవం. భారత పేదరికం బ్రిటిష్ పుణ్యమేనన్న నౌరోజీ సిద్ధాంతాన్ని సమర్థించడమే కాకుండా, తన పత్రికలో ఎంతో ప్రాచుర్యం కల్పించారు. అలాగే గోఖలే చాలా అంశాలలో తిలక్ కు విభేదాలు ఉండేవి. కాంగ్రెస్ నేతల విధానాలపై తిలక్ ఘాటైన విమర్శలు చేశారు: “మీరు సంవత్సరాని కొకసారి మూడు రోజులపాటు సమావేశమై కప్పల మాదిరి బెకబెకలాడడం వల్ల ప్రయోజనం లేదు.” అని, “అసలు కాంగ్రెస్ సంస్థ అడుక్కునేవాళ్ళ సంఘం (బెగ్గర్స్ ఇన్‌స్టి ట్యూషన్)” అన్నారు. కాంగ్రెస్ సమావేశాలను 3-డే తమాషాగా అభివర్ణించారు. “స్వరా జ్యం నా జన్మహక్కు. దాన్ని నేను పొంది తీరుతాను.'' అని తీర్మానించారు. 1889 లో బొంబాయి కాంగ్రెస్ మహాసభకు ప్రతినిధిగా హాజరైన తిలక్ అక్కడనే లాలాలజ్‌పత్ రాయ్, బిపిన్‌చంద్ర పాల్‌ను కలుసు కున్నారు. ఆ ముగ్గురు మహా నేతలు భారతదేశ చరిత్రలో లాల్- బాల్- పాల్‌గా ప్రసిద్ధులైనారు. వారితోనే కాం గ్రెస్‌లో అతివాదుల శకం ప్రారంభమైంది. 1907లో మహారాష్ట్ర లోని సూరత్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ చీలిపో గా, మితవాదులు కాంగ్రెస్ పై తమ పట్టు ను నిలబెట్టు కున్నారు. అతివాదులుగా పిలవబడే తిలక్, ఆయన మద్దతు దారు లు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేశారు. తిరిగి 1916 లో లక్నోలో జరిగిన సమా వేశంలో అంతా ఒకటై నారు. అదే సమావేశంలో కాంగ్రెస్ కు, ముస్లిం లీగు కు మధ్య లక్నో ఒప్పందం కుదిరింది.

తిలక్ పాశ్చాత్య విద్యా విధానాన్ని తీవ్రంగా వ్యతిరే కించారు. అది భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అగౌరవ పరచి భారతీయ విద్యార్థులను చిన్న బుచ్చే విధంగా ఉందని, ప్రజలకు మంచి విద్యను అందిం చడం ద్వారానే వాళ్ళను మంచి పౌరు లుగా మార్చవచ్చనే ఉద్దేశం ఆయనది. ప్రతి భారతీయునికి భారతీయ సంస్కృతి గురించి, భారత దేశపు ఔన్నత్యాన్ని గురించి బోధించాలని ఆయన ఆశయం. అదే ఆశయంతో అగార్కర్, విష్ణుశాస్త్రి చిప్లుంకర్ లతో కలిసి “దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ”ని స్థాపించారు. తర్వాత తాను నడిపిన పత్రికలు “మరాఠా (ఆంగ్ల పత్రిక)”, “కేసరి (మరాఠీ పత్రిక)” లలో మొద్దు నిద్రపోతున్న భారతీయులను మేల్కొల్ప డానికి పదునైన భాషలో బ్రిటిష్ పాల నలోని వాస్తవ పరిస్థితుల గురించి వివ రంగా రాశారు. బాల్య వివాహాలను నిరసి ంచి వితంతు వివాహాలను స్వాగ తించారు. జాతీయ స్ఫూర్తిని రగల్చడానికి వీలున్న ఏ అవకాశాన్నీ ఆయన వదిలి పెట్టలేదు. మొట్టమొదటి సారిగా శివాజీ ఉత్సవాలను, గణపతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం ద్వారా ప్రజలను సమీకరించడం, వారిని జాతీయోద్యమం వైపు నడిపించడం మొదలు పెట్టారు. తన పత్రికల్లో ప్రజలను రెచ్చగొట్టే రాతలు రాసినందుకు 1897లో ఆయనకు ఒకటి న్నరేళ్ళు కారాగారశిక్ష పడింది. విడుదల య్యాక అతను స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1906లో దేశద్రోహం నేరం క్రింద ఆయనకు ఆరేళ్ళ ప్రవాసశిక్ష విధించారు. కారాగారంలో ఉన్నప్పుడే అతను “గీతారహస్యం” అనే పుస్తకం రాశారు. తిలక్ చరిత్రకారుడు కూడా. ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వచ్చారని ఆయన అభిప్రాయం. భగవద్గీ తపై ఆయన రచించిన భాష్యం-856 పేజీల గీతా రహస్యం అనే ఉద్గ్రంథం మొదటి కూర్పు ఆరు వేల ప్రతులు ఒక పక్షంలోనే అమ్ముడు పోయాయంటే అది ఎంత ప్రజాభిమానమైన గ్రంథమో స్పష్టం అవుతున్నది. అన్ని భారతీయ భాషల్లో దాని అనువాదాలు వెలువడ్డాయి.

1916 ఏప్రిల్ లో హోంరూల్ లీగ్‌ని స్థాపించి దాని లక్ష్యాలను వివరిస్తూ మధ్య భారత దేశంలో గ్రామ గ్రామాన తిరిగారు. అనీబిసెంటు అదే సంవత్సరం సెప్టెంబర్‌లో మొదలుపెట్టి హోంరూల్ ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేసింది. ఆ ఉద్యమం ఉధృతంగా కొన సాగుతున్న సమయంలో ఒక కోర్టుకేసులో ఆయన లండనుకు వెళ్ళవలసి వచ్చింది. అప్పుడే, అంటే 1917 ఆగస్టులో అప్పటి సెక్రటరీ ఆఫ్ స్టేట్ మాంటేగు “బ్రిటిష్ సామ్రాజ్యం లో భాగమైన భారత దేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పరచ డానికి వీలుగా అన్ని పాలనాంశాల్లో భారతీయులకు అధిక ప్రాధాన్యాన్ని వ్వడమే ప్రభుత్వ విధానమని బ్రిటిష్ ప్రభుత్వం తరపున ప్రకటించారు.

బ్రిటిష్ ప్రభుత్వ నిజాయితీని నమ్మిన అనీబిసెంటు ఆ ప్రకటన తో ఉద్యమాన్ని ఆపేయగా, ఆ ప్రకటన స్పష్టంగా లేక పోవడం తో, తిలక్ విభేదించగా, ఇద్దరు నాయకులదీ చెరొక దారి కావ డంతో హోంరూల్ ఉద్యమం చల్లబడి పోయింది. కానీ ప్రజల్లో తిలక్ రగిలించిన స్ఫూర్తి మాత్రం కొనసాగింది. అందుకే 1920లో ఆగస్టు 1వ తేదీన తిలక్ మరణం తో జాతీయో ద్యమం చుక్కాని లేని నావ అవుతుందని చాలా మంది భయపడ్డారు.

(జూలై 23 తిలక్ జయంతి సందర్భంగా)

-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494





తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న “సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

-సంపాదకులు

## స్వాగతోపన్యాసం

మాటల్లోని మార్దవానికి నిబ్బరపు గొంతుకను జత కలిపి
సమయమనంతో శ్రీకారం చుట్టే అక్షరగోష్ఠి ఈ పరిచయపత్రం.
మితమైన వర్ణాలకు ఎనలేని భావ సౌందర్యాన్ని జోడించి వేదికపై
వెదజల్లే పూలరెక్కలు
ఆహుతుల సన్నిధిలో ఆసీనులైన ప్రజ్ఞామూర్తుల పరిచయోత్సవమే
ఈ మేలురాక
సందర్భానికి నుడికారాన్ని రంగరించి చేసే అక్షర చమక్కుల
సుగంధపు సత్కారం
ఉత్సాహపు భాషణంతో సభాస్థలికి వేసిన మేల్బంతిశోభల తోరణమే
ఈ అభినందన
పదలాలిత్యానికి పెదవుల జుగల్బందీతో సభాసరస్వతికి
సమర్పించే తొలిపలుకుల సుస్వరమాల

-రాధికాసూరి

## పాత దినాల్లోని చిప్పలు

కైసిప్ప, రాచిప్ప, కొబ్బరిచిప్ప?
అవి కేవలం చిప్పలు కావు,
ఒక తరం జీవన సంస్కృతికి
చిరునామాలు.
చెంచాలు లేని రోజుల్లో
కైసిప్పలే చేతి పొడిగింపులు;
ఉప్పూ, కారం, పసుపూ, పోపుల
సువాసనలతో
వంటింటి జ్ఞాపకాలను మోసిన
చిన్న పాత్రలు.
మట్టికుండల్లో మరిగిన పాలు,
ముంతల్లో తోడుపెట్టిన పెరుగు,
కుండల్లో చల్లబడిన నీళ్లు?
ఆ రుచులన్నీ నేటి లోహ పాత్రల్లో
ఎక్కడ?
రాచిప్పల్లో నిల్వ చేసిన తొక్కులు,
కాల్చిన కొబ్బరిచిప్పల్లో పెట్టిన
పులుసు,
కొలతలకోసం
దాచుకున్న కస్కెలు?
అవన్నీ పొదుపు నేర్పిన పాఠాలే.
మామిడి, ఆనప,
బీరకాయల పొట్టు
నునుపు రాతిపై నీటి చుక్కలతో
రాసుకుంటే,
కైసిప్ప అంచు
చిన్న శిల్పి చేతిలా
నెమ్మదిగా పొట్టు విప్పేది.
పెద్ద కస్కె, నడిపి కస్కె,
బుచ్చి కస్కె?
అవసరానికొకటి, పనికొకటి;
వస్తువులకూ పేర్లు పెట్టిన
ఆ జీవన మమకారం
ఇప్పుడెక్కడ?
కొట్టెలు, కుండలు, గుమ్ములు,
గుల్లలు?
ధాన్యాన్ని మాత్రమే కాదు,
ఒక ఇంటి నిండుదనాన్ని
కాపాడేవి.
జీడిగింజలతో కాచిన నూనె,
తల నిండా రాసి
పెంటరుతో దువ్విన జడలు?
ఆ పరిమళాలు
ఇప్పటికీ జ్ఞాపకాలలోనే
తిరుగుతున్నాయి.
ముంతలు బోర్లా పడకూడదని
ఉట్లపై పెట్టిన జాగ్రత్త,
వస్తువులను వాడటమే కాదు?
వాటిని గౌరవించడం కూడా
ఆ తరం నేర్పింది.
ఇప్పుడు...
ఆ చిప్పలు కనిపించవు.
ఆ పేర్లు వినిపించవు.
ఆ పనిముట్లు
మ్యూజియంలోకీ చేరలేదు.
జ్ఞాపకాలలో మాత్రమే
మిగిలిపోయాయి.
చిప్పలు పగిలిపోయాయి;
కానీ వాటిలో నిండిన సంస్కృతి
ఇంకా పగలలేదు.
వస్తువులు పోవడం కాదు?
వాటితో పాటు
ఒక తరం జీవన తత్వమే
మెల్లగా కనుమరుగవుతోంది.

-సుదర్శనం వేణుశ్రీ.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.